# ప్రజా విముక్తి

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు), తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార పత్రిక

సంపుటి:9 సంచిక:01 మే, 2024

**మేడే ప్రత్యేక సంచిక**



ప్రపంచ శ్రామిక దినం మే డే వర్ధిల్లాలి
ప్రపంచ కార్మికులారా ఏకంకండి......
దేశ విదేశాల్లో ప్రపంచ వ్యాప్తంగా
మీ రెక్కల కష్టంతో, మీ చెమట చుక్కలతో.....
ఎన్నో అద్భుతాలు సృష్టించినా
మీ కష్టానికి ఫలితం లేదు
ప్రపంచాన్ని వెలుగులతో నింపి
మీరు చీకటిలో మగ్గిపోతున్నారు.
సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా
భూస్వామ్య, పెట్టుబడిదారీ దోపిడీ వర్గాలు
మీ హక్కులను కాలరాస్తూ
అణువణువు మీ శ్రమను దోచుకుంటూ
ప్రపంచ కుబేరులుగా ఎగబాకుతున్నారు
దోపిడీదారుల ఆగడాలను తిప్పికొడుతూ
కార్మికవర్గ పోరాటాలను ఉధృతం చేద్దాం
దోపిడీ దారులను తన్ని తరుముదాం
కార్మిక రాజ్యాన్ని స్థాపిద్దాం

# దేశవ్యాప్తంగా కార్మిక వర్గ పోరాటాలు












బిహార్‌లోని హాజీపూర్‌లో డ్రైవర్ల నిరసన



# మేడే అమరగాథ

# పోరుకు ప్రేరణనిచ్చే మేడే

**నేటికి 138 ఏండ్ల క్రితం 1886లో మే 1న అమెరికాలోని షికాగోనగర కార్మికులు 'ఎనిమిది గంటల పనిదినం' కోసం చారిత్రాత్మక పోరాటానికి నాందిపలికారు. ఆ రోజుల్లో పని గంటలకు ఏ నియమమూ లేకుండింది. పొద్దు పొడిచింది మొదలు చీకటయ్యే దాకా కార్మికులు కార్ఖానాల్లో రెక్కలు ముక్కలు చేసుకుంటూ వుండేవాళ్లు.**

ప్రారంభదినాల్లో అమెరికాలో కార్మికులకు రోజుకు 12 నుండి 18 గంటల వరకూ శ్రమించవల్సి వచ్చేది. అత్యధిక కార్మికులు చిన్న వయసులోనే ప్రమాదకరమైన రోగాల బారినపడేవారు. చనిపోయేవారు కూడా. దీనికి వ్యతిరేకంగా పోరాడిన కార్మికులపై ప్రైవేటు గూండాలూ, పోలీసులూ, సైన్యంతో దాడులు చేయించేవాళ్లు. పరిస్థితి అత్యంత దారుణంగా వుండేది.

నిర్బంధం నుండి ప్రతిఘటన పుడుతుంది. పోరాట కాంక్ష అలలను సృష్టిస్తుంది. అమెరికా కార్మికయోధులు పోరు మార్గాన్ని ఎంచుకున్నారు. 1877 నుండి 1886 వరకూ ఇక్కడి కార్మికులు దేశవ్యాప్తంగా ఎనిమిది గంటల పని దినపు డిమాండ్ పై ఏకం కావడం, సంఘటితం కావడం ప్రారంభించారు. 1886లో అమెరికా అంతటా కార్మికులు 'ఎనిమిది గంటల కమిటీలు' ఏర్పాటు చేసుకున్నారు. షికాగోలోని కార్మిక ఉద్యమం అన్నింటికంటే బలంగా వుండింది. మే 1న కార్మికులందరూ తమ పనిముట్లను పక్కన రోడ్ల మీదికి పోవాలని, ఎనిమిది గంటల పనిదినపు నినాదాన్ని హోరెత్తించాలని చికాగో కార్మికులు నిర్ణయించుకున్నారు.

**ఇలా పుట్టింది మేడే ఉద్యమం**

1886, మే 1న అమెరికా అంతటా లక్షలాది కార్మికులు ఒకేసారి సమ్మె ప్రారంభించారు. సమ్మెలో పదకొండు వేల ఫ్యాక్టరీలకు చెందిన కనీసం మూడు లక్షల ఎనభై వేల మంది కార్మికులు పాల్గొన్నారు. చికాగో నగర దరిదాపుల్లోని రైలు రవాణా మార్గమంతా స్థంభించిపోయింది. చికాగోలోని అత్యధిక కార్ఖానాలూ, వర్క్ షాపులూ బందయ్యాయి. నగరంలోని ప్రధాన మార్గమైన మిషిగన్ ఎవెన్యూపై అల్బర్ట్ పార్సన్స్ నాయకత్వంలో కార్మికులు ఒక భారీ ర్యాలీ నిర్వహించారు.

పెరుగుతున్న కార్మికుల బలమూ, వాళ్ల నాయకుల తొణకని సంకల్పంతో భయభ్రాంతులైన పారిశ్రామికవేత్తలు కార్మికులపై నిరంతరాయంగా దాడులు చేసే ఎత్తుగడలు అవలంబించారు. పెట్టుబడిదారుల యాజమాన్యంలోని మొత్తం పత్రికలన్నీ 'ఎర్ర ప్రమాదం' గురించి మొత్తుకోసాగాయి. పెట్టుబడిదారులు చుట్టుపక్కల ప్రాంతాల నుండి కూడా పోలీసులనూ, సాయుధ బలగాలనూ పిలిపించి మోహరింపజేశారు. వీరితో పాటు కుఖ్యాత పింకర్టన్ ఏజెన్సీకి చెందిన గూండాలను కూడా సాయుధం చేసి కార్మికులపై దాడులు చేయడానికి సర్వసన్నద్ధంగా వుంచారు. పెట్టుబడిదారులు 'అత్యవసర స్థితి'ని ప్రకటించారు. నిరంతరం వాళ్ల సమావేశాలు నడుస్తూనే వుండినాయి. ఆ సమావేశాల్లో ఈ ప్రమాదకరమైన స్థితి నుండి బయటపడడానికి సమాలోచనలు జరుగుతూనే వుండినాయి.

మే 3న మైకార్మిక్ హార్వెస్టింగ్ మెషీన్ కంపెనీ కార్మికులు తమ పోరాటాన్ని ముందుకు తీసుకుపోయినపుడు నగర పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తతకు చేరుకున్నాయి. కార్మికులు ప్రతిఘటనా సభ ప్రారంభించగానే నిరాయుధ కార్మికులపై తూటాలు కురిపించబడ్డాయి. నలుగురు కార్మికులు చనిపోయారు. చాలా మంది గాయపడ్డారు. ఆ తర్వాతి రోజు కూడా కార్మిక బృందాలపై దాడులు కొనసాగాయి. ఈ క్రూరమైన పోలీసు నిర్బంధానికి వ్యతిరేకంగా మే 4వ తేదీ రాత్రి చికాగో నగర ప్రధాన మార్కెట్ అయిన హే మార్కెట్ స్క్వేర్ వద్ద ఒక ప్రజా సభ జరిగింది. దీనికి నగర మేయర్ నుండి అనుమతి కూడా లభించింది.



జార్జ్ ఏంజెల్     మైఖేల్ శ్వాబ్     అల్బర్ట్ పార్సన్స్     ఆగస్ట్ స్పాయిస్     సామ్యూల్ ఫీల్డెన్     ఎడోల్ఫ్ ఫిషర్     ఆస్కార్ నీబే

నలుగురు కార్మిక నాయకులు విప్లవ గీతికలు ఆలపిస్తూ ఉరికొయ్యను చేరుకున్నారు. ఠీవీగా తమ స్థానాల్లో నిలబడ్డారు. ఉరితాళ్ళు వాళ్ల మెడలో వేయబడ్డాయి. స్పాయిస్ తాడు చాలా గట్టిగా వుండింది. ఫిషర్ దానిని సరిచేస్తే స్పాయిస్ చిరునవ్వు నవ్వి ధన్యవాదాలు చెప్పాడు. తిరిగి స్పాయిస్ గొంతెత్తి ''ఒక సమయం వస్తుంది, ఆనాడు మా నిశ్శబ్దం నువ్వు నేడు నొక్కివేస్తున్న స్వరాల కంటే చాలా బలిష్టమైనది అవుతుంది.' అన్నాడు. తర్వాత పార్సన్స్ మాట్లాడడం మొదలుపెట్టాడు. నా మాట వినండి, అమెరికా ప్రజలారా, నా మాట వినండి, జనం గొంతుకను నొక్కివేయలేరు, కానీ ఇంతలోనే ఉరికొయ్య లాగమడింది''.

– ఆ సమయంలో అక్కడున్న ఒక పాత్రికేయుడి మాటలు.

సభ రాత్రి ఎనిమిది గంటలకు ప్రారంభమైంది. దాదాపు మూడు వేల ప్రజల సమక్షంలో కార్మిక నాయకులకు పార్సన్స్, స్పాయిస్ లు ఐక్యంగా, సంఘటితంగా వుండి పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కోవాలని కార్మికులకు పిలుపునిచ్చారు. మూడవ వక్త సామ్యూల్ ఫీల్డెన్ మాట్లాడ్డానికి లేచేప్పటికి రాత్రి పది గంటలు కావొస్తుండింది. వర్షం కూడా ప్రారంభమైంది. అప్పటికి స్పాయిస్, పార్సన్స్ లు తమ భార్యలూ, ఇద్దరూ పిల్లలో పాటు అక్కడి నుండి వెళ్ళిపోయారు. జనం పల్చబడ్డారు. సభ ముగింపుకు చేరువవుతుండగా కుఖ్యాత కెప్టెన్ బాన్ఫీల్డ్ నాయకత్వంలో గుంపులు గుంపులుగా పోలీసులు ధడేల్ మని సభా స్థలంలోకి చొరబడ్డారు. సభికులను వెంటనే అక్కడి నుండి వెళ్లిపొమ్మని హుకూం జారీ చేశారు. ఇది శాంతియుత సభ అని సామ్యూల్ పోలీసులకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తుండగానే ఎవరో ఒక బాంబును విసిరారు. బాంబు విసిరిన వాళ్లు పోలీసుల కిరాయి మనుషులని భావించబడుతున్నది. బాంబు పెలుడులో ఒక పోలీసు చనిపోయాడు. ఐదుగురు గాయపడ్డారు. పిచ్చెక్కిన పోలీసులు మార్కెటును నాలుగు వైపులా చుట్టుముట్టి సభికుల పైకి విచక్షణా రహితంగా కాల్పులు జరపడం మొదలుపెట్టారు. పారిపోవడానికి ప్రయత్నించిన వాళ్ల పైనా తూటాల, లాఠీల వర్షం కురిపించారు. దీంట్లో ఆరుగురు కార్మికులు చనిపోయారు. రెండు వందలకు పైగా గాయపడ్డారు. కార్మికులు తమ నెత్తుటితో ఎరుపెక్కిన గుడ్డను ఎగిరేసి దానిని కార్మికుల జెండాగా మలిచారు.

ఈ సంఘటన తర్వాత పోలీసులు చికాగో వ్యాప్తంగా కార్మికుల బస్తీలపై కార్మిక సంఘాల కార్యాలయాలపై, ప్రచురణాలయాలపై దాడులు చేశారు. వందలాది నిర్దోషులను కొట్టారు. తీవ్రంగా హింసించారు. వేలాది మందిని అరెస్టు చేశారు. ఎనిమిది మంది కార్మిక నాయకుల – అల్బర్ట్ పార్సన్స్, ఆగస్ట్ స్పాయిస్, జార్జ్ ఏంజెల్, డాల్ఫ్ ఫిషర్, సామ్యూల్ ఫీల్డెన్, మైఖేల్ శ్వాబ్, లుయిస్ లింగ్, ఆస్కర్ నీబె పై తప్పుడు కేసు బనాయించారు. విచారణ జరిపి వాళ్లను దోషులుగా నిర్ధారించారు. వీళ్లలో కేవలం సామ్యూల్ ఫీల్డెన్ మాత్రమే బాంబు పేలిన సమయంలో ఘటనా స్థలంలో వున్నాడు. విచారణ ప్రారంభమైనపుడు ఏడుగురే బోనులో వున్నారు. నెలన్నర పాటు పరారీలో వున్న అల్బర్ట్ పార్సన్స్ కార్మికుల పక్షాన స్వయంగా కోర్టుకు వచ్చాడు. 'నేను నిర్దోషులైన నా సహచరులతో పాటు బోనులో నిలబడ్డానికి వచ్చాను.' అని ఆయన జడ్జితో అన్నాడు.

ప్రపంచంలో ఎక్కడ పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందిందో, అక్కడ ఒక విశాల కార్మిక వర్గం ఆవిర్భవించింది. ఈ కార్మికులు తమ ద్రుఢమైన చేతులతో పెద్ద పెద్ద నగరాలను రూపొందించారు. రోడ్లు, రైలు పట్టాలను పరిచారు. నదులను బంధించారు. ఆకాశాన్ని తాకే భవంతులను నిర్మించారు. పెట్టుబడిదారుల కోసం ప్రపంచంలోని అన్ని భోగ విలాస సాధనాలను సమకూర్చారు. మిల్లుల్లో-కార్ఖానాల్లో తమల్ని తాము కరిగించుకొని పెట్టుబడిదారుల ఇనుపపెట్టెలను నింపారు. కానీ వాళ్లకు వాటాగా వచ్చింది భయంకరమైన పేదరికం, దురవస్థ, దోపిడీ, నిర్బంధం, ఇక్కడి నుండే మొదలైంది తమ హక్కు-అధికారాల పోరాటం, త్యాగాల నిరుపమాన నూతన శకం.

విచారణ డ్రామా, దౌర్జన్యపు శిక్ష

పెట్టుబడిదారీ సుదీర్ఘ న్యాయ నాటకం తర్వాత 1887 ఆగస్టు 20న చికాగో కోర్టు ఏడుగురికి మరణశిక్ష విధించింది. ఆస్కార్ నీబెకు మాత్రం 15 సంవత్సరాల కారాగార శిక్షను విధించింది. స్పాయిస్ కోర్టులో గొంతెత్తి ఇలా చెప్పాడు – 'మమ్మల్ని ఉరి కొయ్యకు వేళ్లాడదీసి కార్మికోద్యమాన్ని, పేదరికం, దయనీయ పరిస్థితుల్లో రెక్కలు ముక్కలు చేసుకొనే లక్షలాది ప్రజల ఉద్యమాన్ని అణచివేయగలనని నువ్వనుకుంటున్నావా? అలా నువ్వనుకుంటున్నయితే సంతోషంగా మమ్మల్ని ఉరితీయి. అయితే గుర్తు పెట్టుకో. నువ్వీరోజు ఒక అగ్ని కణాన్ని నలిపివేస్తున్నావు. కానీ ఇక్కడా, అక్కడా, నీ వెనుకా, నీ ముందూ, అన్ని దిక్కులా అగ్ని జ్వాలలు భగ్గుమంటాయి. ఇది దావానలం. నువ్వు దీన్ని ఎప్పటికీ ఆర్పలేవు.'

అమెరికా యావత్తూ, ఇతర అన్ని దేశాల్లోనూ ఈ క్రూర తీర్పుకు వ్యతిరేకంగా భగ్గుమన్న ప్రజల ఆగ్రహం ఫలితంగా సామ్యూల్ ఫీల్డెన్, మైఖేల్ శ్వాబ్ ల మరణ శిక్ష ఆజీవన కారావాసంగా మార్చబడింది. 1887, నవంబర్ 10న అందర్లోకి చిన్నవాడైన లుయిస్ లింగ్ జైలు గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు.

**యావత్ నిర్బంధ చర్యలూ, నెత్తుటి సముద్రంలో ముంచే ప్రయత్నాలను తట్టుకుంటూ కార్మికోద్యమ పరంపర ముందుకే సాగింది. పని గంటలు నిర్ణయించాలనే డిమాండ్ తో ప్రపంచవ్యాప్తంగా వేర్వేరు చోట్ల పోరాటాలు జరుగసాగాయి. పోరాటాల నడుమ 'ఎనిమిది గంటలు పని, ఎనిమిది గంటలు మానసిక ఉల్లాసం, ఎనిమిది గంటలు విశ్రాంతి' అనే నినాదం ముందుకు వచ్చింది. భారతదేశంలో కూడా 1862లో కార్మికులు ఈ డిమాండ్ తో సమ్మె చేశారు. అయితే మొదటిసారి పెద్ద ఎత్తున దీనికి ప్రారంభం అమెరికాలో జరిగింది.**

1887, నవంబర్ 11 కార్మిక వర్గ చరిత్రలో చీకటి శుక్రవారం. పార్సన్స్, స్పాయిస్, ఏంజెల్, ఫిషర్లను చికాగోలోని కుక్ కౌంటీ జైలులో ఉరితీశారు. నవంబర్ 13న నలుగురు కార్మిక యోధుల శవయాత్ర చికాగో కార్మికుల భారీ ర్యాలీగా మారింది. ఐదు లఓలకు మించిన జనం ఈ నాయకులకు ఆఖరి వందనం అర్పించడానికి రోడ్ల మీదకి ఉవ్వెత్తున ఎగిశారు.

మూడేళ్ల తర్వాత 1889లో కార్మిక ఉద్యమ ఉపాధ్యాయులు మే 1ని అంతర్జాతీయ కార్మిక దినంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అప్పటి నుండి యావత్ ప్రపంచ కార్మికులు దీనిని పోరాట సంకేత దినంగా పాటిస్తున్నారు. సమరశీల ఐక్యతను చాటుతూ తమ విముక్తి పోరాటాన్ని ముందుకు తీసుకెళ్ళడానికి ప్రేరణను పొందుతున్నారు.

అప్పటి నుండీ ఈ 138 ఏండ్లల్లో అసంఖ్యాకమైన పోరాటాల్లో పారిన కోట్లాది కార్మికుల నెత్తురు అంత సులువుగా భూమిలో ఇంకిపోదు. ఉరి కొయ్య నుండి మారుమోగిన స్పాయిస్ గళం పెట్టుబడిదారుల గుండెల్లో భయాన్ని పుట్టిస్తూనే వుంటుంది. అసంఖ్యాక కార్మికుల నెత్తుటి కాంతితో మెరిసే ఎర్ర జెండా ముందుకు నడవడానికి మనకు ప్రేరణనిస్తూనే వుంటుంది.

**ఈ భూమి మీద నుంచీ మనిషి మనిషిని దోపిడీ చేసే వ్యవస్థను నిర్మూలించడం అవసరం. అందుకని ఐక్యమవుతూ కలిసి పోరాడడం ద్వారా మాత్రమే యావత్తు ప్రపంచంలో కార్మికుల, సమస్త మానవాళినీ విముక్తి చేసి అంతిమంగా తమ్ము తాము విముక్తి చేసుకోగలుగుతారు.**

**– మావో**

# ధ్వనిస్తోన్న ఊపిరులూ, అడుగుల సవ్వడులూ

(మేడే అమరుల ఈ కథ హోవర్డ్ ఫాస్ట్ రాసిన ప్రఖ్యాత నవల 'ది అమెరికన్' లోని ఒక భాగం. కార్మికోద్యమ సానుభూతిపరుడైన పీటర్ ఆల్ట్ గేల్డ అనే జడ్జి సాక్షిగా మేడే అమరుల అంతిమ యాత్ర దృశ్యమిది.)

– సంపాదకవర్గం.

వాళ్లకు శుక్రవారం ఉరిశిక్ష విధించబడింది. మరుసటి రోజు వార్తా పత్రికల్లో ఉరికి సంబంధించిన విస్తృతమైన వివరాలు, కుప్పల కొద్దీ సంపాదకీయాలు ప్రచురించబడ్డాయి. చనిపోయిన వ్యక్తుల పైనా, చట్టాలూ–వ్యవస్థపైనా, ప్రజాస్వామ్యం పైనా, రాజ్యాంగమూ దాని అనేకానేక సవరణల పైనా – వీటిలో కొన్నింటిని 'హక్కుల బిల్లులు' అని పిలుస్తారు. విప్లవం, ప్రజాస్వామ్య స్థాపకుల గురించీ, గృహయుద్ధం గురించీ. వీటితో పాటే అంత్యక్రియల సూచనలు కూడా ప్రచురించబడ్డాయి. నగర అధికారులు అయిదుగురి మృతుల – తన గదిలో చనిపోయిన లింగ్తో పాటు పార్సన్స్, స్పాయిస్, ఫిషర్, ఏంజెల్ ల – దేహాలను తీసుకోవడానికి వాళ్ల బంధుమిత్రులకు అనుమతినిచ్చారు. కావాలనుకుంటే బహిరంగ అంత్యక్రియలు జరపడానికి కూడా ఈ బంధుమిత్రులకు అనుమతి ఇవ్వబడింది. వాయిల్డ్ హోయిమ్ శ్మశాన వాటికకు పోవడానికి శోకయాత్ర ఏయే రోడ్లపై నుండి వెళ్లవచ్చునో మేయర్ రోశ్ ప్రకటన జారీ చేశాడు. ఇదంతా పన్నెండు నుండి రెండు గంటల మధ్యలో ముగియాల్సి వుంటుంది. కేవలం విషాద సంగీతం మోగించవచ్చును. ఆయుధాలు వెంట తీసుకుపోకూడదు. జెండాలు, బ్యానర్లు పట్టుకొని నడవకూడదు. 'మృతులు సమాజానికి శత్రువులుగా ప్రకటించబడిన వాళ్లు, నేరస్థులు, హంతకులు, అయినప్పటికీ అంత్యక్రియల్లో పాల్గొనడానికి కొన్ని వందల మంది రావొచ్చున'ని వార్తా పత్రికలు రాశాయి. మతస్వాతంత్ర్యానికి గ్యారంటీనిచ్చే రాజ్యాంగంలోని అధికరణం ప్రకారం అంత్యక్రియలకు అనుమతినివ్వడం న్యాయసంగతమైనది.

ఆదివారం నాడు జడ్జి తాను వాకింగ్కు వెళ్తున్నానని భార్యతో చెప్పాడు. అయితే అతను వాకింగ్ చేస్తూ ఎక్కడికి వెళ్తాడో ఎమ్మా అనుమానించింది కానీ ఏమీ మాట్లాడలేదు. ఆదివారపు ఉదయం ఒంటరిగా బయటికి వెళ్ళాలనే అతనికోరిక విచిత్రంగా వుందని ఆమె అనలేదు. కానీ నిజానికి అది ఆశ్చర్యకరమైన విషయం కాదు. జులూస్ కోసం ఎదురుచూస్తున్నట్లుగా అనిపించింది అతనికి.

ఉదయం చల్లగా వుంది. ప్రజలు తనను గుర్తుపట్టడం అతనికి ఇష్టం లేదు. అందుకని అతను కోటు కాలర్ ను పైకెత్తుకున్నాడు. టోపీని నుదుటి మీద కిందికి లాక్కున్నాడు. చేతులను జేబుల్లోకి దోపుకొని శరీర భారాన్ని కాసేపు కంపిస్తున్న ఒక కాలుపై కాసేపు మరొకకాలుపై మోపుతూ ఎదురుచూడసాగాడు.

జులూస్ కనిపించింది. అది అనుకున్నట్టుగా లేదు. అనుమతినిచ్చిన అధికారులు అనుకున్నట్టుగానయితే అసలే లేదు. ఏ సంగీతమూ లేదు, అడుగుల చిరు సవ్వడులూ, స్త్రీల మంద్రపు వెక్కిళ్లు తప్ప. శబ్దాలన్నీ, అరుపులన్నీ వీటిలోనే మునిగిపోయాయి. యావత్ నగరాన్ని ఒక విశాలమైన, శోకపూరితమైన నిశ్శబ్ద కఫన్ కప్పివేసినట్టుగా వుంది.

మొదట జెండా పట్టుకొని ఒక మనిషి వచ్చాడు. జులూస్ లోని ఏకైక జెండా. ఒక పాత, రంగు వెలిసిన నక్షత్రాలూ, పట్టీల జెండా. అది గృహ యుద్ధం సమసయంలో సగర్వంగా ఒక రెజిమెంట్ ముందర గిరేది. దాన్ని పట్టుకొని నడుస్తున్నది గృహ యుద్ధంలో పోరాడిన ఒక సైనికుడు. నడీడులో వున్న అతని మొహం రాతితో మలిచినట్టుగా అన్పిస్తున్నది.

తర్వాత వచ్చాయి మృతదేహాలూ, శవపేటికలూ, తర్వాత పాత, కప్పులేని గుర్రపు బండ్లు వచ్చాయి. వాటిల్లో కుటుంబ సభ్యులున్నారు. వాటిల్లో ఒక దాంట్లో ఆల్ట్ గేల్డ్ కు లూసీ పార్సన్స్ (అమర కార్మిక నాయకుడు పార్సన్స జీవిత భాగస్వామి) కనిపించింది. ఆమె తన ఇద్దరి పిల్లలతో పాటు కూర్చొని వుంది. ఆమె చూపులు సూటిగా ఎదుటికి సారించి వున్నాయి.

తర్వాత వచ్చారు మృతుల విడదీయలేని స్నేహితులు, వాళ్ల కామ్రేడ్లు. వాళ్లు నాలుగు నాలుగు వరుసల్లో నడుస్తున్నారు. గృహయుద్ధంలో పాల్గొన్న సైనికుడి మొహం వలెనే వాళ్ల మొహాలు కూడా ఉదాసీనంగా వున్నాయి.

తర్వాత మంచి దుస్తులు ధరించిన పురుషుల, స్త్రీల సమూహం వచ్చింది. వాళ్లలో చాలా మంది ఆల్ట గోల్డ్ కు తెలిసిన వాళ్లే, పరిచయస్తులే. లాయర్, జడ్జి, డాక్టర్, టీచర్, చిన్న వ్యాపారులు, ఇంకా చాలామంది. వీళ్లంతా ఈ అయిదుగురిని కాపాడడానికి పోరాడినవాళ్లు.

తర్వాత వచ్చారు కార్మికులు. వీళ్ల సంఖ్యకు హద్దుల్లేవు. వాళ్లు ప్యాకింగ్ కంపెనీల నుండి, కట్టెల కార్ఖానాల నుండి, మైకార్మిక్, పుల్మెన్ కార్ఖానాల నుండి వచ్చారు. వాళ్లు మిల్లుల నుండి, ఎరువుల కంపెనీల నుండి రైల్వే యార్డుల నుండి, రేకు పీపాల గోదాముల నుండి వచ్చారు. వాళ్లు నిరుద్యోగులు నివసించే ధర్మశాలల నుండి, రోడ్ల నుండి, గోధుమ చేన్ల నుండి, చికాగో, ఇంకా డజన్ల కొద్ది ఇతర నగరాల వీధుల నుండి వచ్చారు. చాలా మంది తమకున్న వాటిలోకెల్లా మంచి బట్టలను ధరించారు. తమ ఏకైక నల్ల పెళ్లి సూట్ను ధరించారు. చాలా మందితో పాటు వాళ్ల భార్యలు కూడా వున్నారు. పిల్లలు కూడా వాళ్లతో పాటు నడుస్తున్నారు. కొంత మంది పిల్లలను ఎత్తుకొని వున్నారు. కానీ వాళ్లలో చాలా మందికి పని దుస్తులు తప్ప వేరే బట్టలు లేవు. వాళ్లు తమ మొత్తం దుస్తులు, నీలి జీన్స్, కమీజు ధరించి వున్నారు. పశువుల కాపర్లు కూడా ఉన్నారు. వాళ్లు అయిదు వందల మైళ్ల దూరం నుండి తమ గుర్రాలపై వచ్చారు. వాళ్లసలు వీళ్ల శిక్ష మాఫీ అవుతుందనుకొని వచ్చారు. షికాగో ప్రజల పట్ల వాళ్లకు విశ్వాసం వుండింది. కానీ ఆ శిక్ష మాఫీ కానీ పరిస్థితిలో అంత్యక్రియల్లో పాల్గొనడానికి ఆగిపోయారు. వాళ్లు తమ మొరటైన ఎత్తు మడుమల చెప్పులు తొడుక్కొని నడుస్తున్నారు. వాళ్లలో నగరానికి సమీపంలోని గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన ఎర్ర ముఖపు రైతులున్నారు. ఇంజన్ డ్రైవర్లున్నారు. విశాలమైన జలాశయాల నుండి వచ్చిన నావికులు వున్నారు.

వందలాది పోలీసులు, పింకర్ టన్ మనుషులూ రోడ్డుకు రెండు దిక్కులా నిలబడి వున్నారు. కానీ వాళ్లు జులూస్ను చూసి నిశ్శబ్దంగా నిలబడిపోయారు. వాళ్లు తుపాకులను పక్కన పట్టేశారు. చూపులను నేలమీదికి వాల్చేసుకున్నారు. ఎందుకంటే కార్మికులు శాంతంగా వున్నారు. వినిపిస్తున్నది కేవలం వాళ్ల ఊపిరులూ, నడుస్తున్న పాదాల సవ్వడులే. ఒక్క శబ్దం కూడా వినబడడం లేదు. ఎవరూ మాట్లాడడం లేదు. పురుషులూ, స్త్రీలూ, ఆఖరికి పిల్లలు కూడా మాట్లాడడం లేదు. రోడ్డు పక్కన నిలబడ్డ వాళ్లు కూడా నిశ్శబ్దంగా వున్నారు.

ఇప్పటికీ కార్మికుల వస్తూనే వున్నారు. ఆల్ట్ గేల్డ్ ఒక గంట దాకా నిలబడి వున్నాడు. కానీ వాళ్లు వస్తూనే వున్నారు. భుజం భుజం కలిపి నడుస్తూ, రాతి వంటి మొహాలతో, కండ్ల నుండి మెల్ల మెల్లగా కన్నీళ్లు కారుస్తూ, కానీ వాటిని ఎవరూ తుడుచుకోవడం లేదు. మరొక గంట గడిచింది. కానీ వస్తున్న వాళ్లకు అంతులేదు. ఎన్ని వేల మంది వచ్చారు. ఎన్ని వేల మంది ఇంకా రావాల్సి వుంది, అతను అంచనా వేయలేకపోతున్నాడు. కానీ ఒక విషయం అతనికి తెలుసు, ఈ దేశ చరిత్రలో ఇటువంటి అంత్యక్రియలు ఎప్పుడూ జరగలేదు. అత్యంత ప్రియతమ నాయకుడు అబ్రహం లింకన్ మరణించినప్పుడు కూడా జరగలేదు.

''షికాగో పోలీసుల ప్రకారం అమర కార్మిక నాయకుల శోక యాత్రలో ఆరు లక్షలకు మించిన ప్రజలు పాల్గొన్నారు.''

(సంఘర్ష్ రత్ మెహనత్ కశ్ పత్రిక సౌజన్యంతో)

**ఒక సరైన రాజకీయ పంథా రూపొందించబడిన తర్వాత, ఆచరణలో పరీక్షించబడిన తర్వాత, పార్టీ నెరిపే నాయకత్వంలో పార్టీ క్యాడర్లు నిర్ణయాత్మక శక్తి అవుతారు. రాజకీయ పంథాను ఆచరణలో పెట్టాలంటే మనకు క్యాడర్లు, పార్టీ రాజకీయ పంథాను అర్థం చేసుకున్నవాళ్లు, ఆ పంథాను తమదిగా స్వీకరించిన వాళ్లు, దానిని ఆచరణలో పెట్టడానికి సిద్ధమైన వాళ్లు, దానిని నిజంగా మార్చగలిగిన వాళ్లు, దానిని ఆచరణలో పెట్టి దానికి జవాబుదారీ వహించేవాళ్లు, దానిని పరీక్షించి దాని కోసం పోరాడేవాళ్లు మనకుండి తీరాలి. దీనిలో విఫలమైతే ఒక సరైన రాజకీయ పంథా శుద్ధ నామమాత్రమైనదిగా అయిపోయే ప్రమాదం వుంది.**

**- స్టాలిన్, (లెనినిజం పునాదులు).**

# దేశవ్యాప్తంగా కార్మికవర్గ పోరాటాలు

## కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా పోరాటం

స్వాతంత్ర్యానికి పూర్వం నాటి బ్రిటీష్ ప్రభుత్వంతో విరోచితంగా పోరాడిన చరిత్ర భారత కార్మిక వర్గానికీ వుంది. అధికార మార్పిడి తర్వాత భారత దోపిడి పాలకవర్గాలకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేసి కార్మికులు సాధించుకున్న హక్కులన్నింటినీ బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీజేపీ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రమంగా హరించివేశారు. కార్మికుల ప్రయోజనాలను ఎంతో కొంత కాపాడుతున్న 44 కార్మిక చట్టాలను కాలరాచి సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బడా బూర్జువాల ప్రయోజనాలను నేరవేర్చే విధంగా నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి మోడీ ప్రభుత్వం కార్మిక వర్గానికీ తీరని ద్రోహం చేస్తున్నది.



హైదారాబాద్ లో రవాణా కార్మికుల ర్యాలీ

కేంద్రంలోని ఫాసిస్టు బీజేపీ మోడీ ప్రభుత్వం అచ్చేదిన్ ఆయేగా, వికాస్ భారత్, ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి మోసపూరితమైన అనేక నినాదాలు ఇచ్చినా సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ఈ పథకాలన్నీ ఎండమావుల లాంటివే. దేశంలో 144 కోట్ల మంది ప్రజల్లో ఎనభై కోట్ల మంది దారిద్ర్య రేఖకు దిగువన మగ్గిపోతున్నట్లు ఆక్స్ ఫాం నివేదిక తెలియజేసింది. శ్రామికుల నిజ వేతనాలు ఇరవై శాతం తగ్గిపోయాయి. సామాన్య ప్రజల సంపదను, శ్రమ శక్తిని దోచి, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ కార్పొరేట్లకు లాభాలు పెంచడం కోసమే మోడీ ప్రభుత్వం ముందుకు సాగుతుంది. నోట్ల రద్దుతో దేశంలో నల్లధనాన్ని వెనక్కి తెచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు డిపాజిట్ చేస్తామన్న వాగ్దానాలన్నీ ఎన్నికల గారడీ మాటలుగా మిగిలిపోగా 2023లో కార్పొరేట్లకు మాత్రం 2.14 లక్షల కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేశాడు.

బీజేపీ నరేంద్రమోడీ ఫాసిస్టు విధానాల వల్ల కార్పొరేట్ సంస్థల లాభాలు రోజు రోజుకు గరిష్ట స్థాయికి చేరుతున్నాయి. 2019-2022 మధ్యకాలంలో ఒక శాతంగా ఉన్న బడా కార్పొరేట్ల వాస్తవ ఆదాయం 30 శాతానికి అభివృద్ధి చెందగా, పేదల వాస్తవ ఆదాయం 11 శాతానికి పడిపోయింది. కనీస వేతనాలు పడిపోవడంతో నిరుద్యోగం, దారిద్ర్యం రోజు రోజుకు పెరిగిపోతున్నది. బ్రహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు మోడీ ప్రభుత్వం సామ్రాజ్యవాద దోపిడీ అనుకూల నయా ఉదారవాద విధానాలను, ప్రజా వ్యతిరేక విధానాలను దూకుడుగా అమలు చేస్తున్నది.

ప్రభుత్వరంగ సంస్థలను వ్యూహాత్మకంగా నష్టాలలోకి దింపడమే కాక, వినివేశీకరణ పేరుతో అమ్మకాలకు పెడుతూ కార్పొరేట్ల పరం చేస్తున్నది. చట్టాలలో మార్పులు తెస్తూ నేషనల్ మానిటైజేషన్ పైప్లైన్ (ఎన్.ఎం.పి) పాలసీ ద్వారా మౌలిక వసతులను లీజు పేరుతో ప్రైవేటీకరిస్తున్నది. కోల్ బెల్ట్ బొగ్గు బ్లాకులను వేలం వేయడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నది. ఉద్యోగుల కష్టార్జితమైన ప్రావిడెంట్ ఫండ్ (పిఎఫ్), పెన్షన్ నిధులను ప్రయివేటు ఇన్సూరెన్స్, మ్యూచువల్ ఫండ్ సంస్థలకు కట్టబెడుతున్నది. కార్మికులు, మధ్యతరగతి ప్రజల్లో అత్యధికులు పాలసీదార్లుగా వున్న ఎల్.ఐ.సీ వాటాలను అమ్మేందుకు ప్రయత్నిస్తున్నది, కార్పొరేట్లు ఎగ్గొట్టిన రుణాలతో ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేస్తున్నది.

అంబానీ, అదానీ వంటి దళారీ పెట్టుబడిదారీ, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం కార్మిక పోరాటాల, త్యాగాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తెచ్చింది. ఎనిమిది గంటల పని దినం స్థానంలో 12 గంటల పని విధానం అమల్లోకి తెస్తున్నది. సమ్మె హక్కును కాలరాస్తున్నది. పిఎఫ్, ఇ.ఎస్.ఐ, వెల్ఫేర్ బోర్డలను నిర్వీర్యం చేస్తున్నది. కాంట్రాక్టు లేబర్ విధానాన్ని పెంచి అన్ని రంగాల్లో మరింత శ్రమ దోపిడీకి గురి చేస్తున్నది. దీంతో దేశ వ్యాప్తంగా 40 కోట్ల మంది అసంఘటితరంగ కార్మికులకు భద్రత లేకుండా పోతుందని, బ్యాంకు, ఎల్ఐసి మరియు సంఘటిత రంగంలోని ఉద్యోగుల నుండి అసంఘటిత రంగంలోని స్కీమ్ వర్కర్ల వరకు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, వారి జీవనోపాధికీ మరియు మెరుగైన జీవన ప్రమాణాల భద్రత కోసం పోరాట మార్గంలో వెళ్లారు. బీహార్, ఉత్తరాఖండ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో స్కీమ్ వర్కర్లు నెల రోజులకు పైగా తరచూ సమ్మెలు చేశారు. అయినప్పటికీ ఫాసిస్టు బీజేపీ ప్రభుత్వం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయకపోవడమే కాక కార్పొరేట్ అనుకూల, నయా ఉదారవాద ఎజెండాను దూకుడుగా ముందుకు తీసుకెళ్తున్నది.

‘‘కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల, ఉద్యోగుల సమస్యలైన షెడ్యూల్డ్ ఎంప్లాయ్మెంట్లలో కనీస వేతనాల జీ.ఓ.లను వెంటనే సవరించి వేతనాలను పెంచాలి. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి వారిని పర్మినెంట్ చేయాలి. సంవత్సరానికి 200 రోజుల పని దినాలతో ఉపాధి కల్పించాలి. రోజుకు రూ.1000 కూలిని నిర్ణయించాలి. అంగన్వాడీ, మధ్యాహ్నభోజనం స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించాలి. వారికి కనీస వేతనం 30 వేలు చెల్లించాలి. పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించి జీఎస్టీని తొలగించాలి. పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలి. రైతులు పండించిన పంటకు మద్దతు ధర చట్టం చేయాలి,’’ అనే న్యాయమైన డిమాండ్ల అమలుకై, కార్మికవర్గ వ్యతిరేక నాలుగు కోడ్లకు వ్యతిరేకంగా వివిధ జాతీయ కార్మిక సంఘాల పిలుపునందుకొని కార్మిక, కర్షకులు దేశవ్యాప్త నిరసనలు, ఆందోళనలు, పోరాటాలు చేపట్టారు.


ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర ధర్నాలో పాల్గొన్న రైతులు

ప్రజల మౌలిక అవసరాలను తీర్చడంలో విఫలమైన కార్పొరేట్, మతోన్మాద శక్తుల రాజ్యం రోజువారీ జీవిత సమస్యల నుండి వారి దృష్టిని మళ్లించేందుకు మత ద్వేషాలను, భావోద్వేగాలను రెచ్చగొట్టి రైతాంగ, కార్మికవర్గ ఐక్యతను దెబ్బతీయడానికి కుట్రలు చేస్తున్నది. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ యంత్రాంగాన్ని, పోలీసు మూకలను ఉపయోగించి హక్కుల కోసం గొంతెత్తిన ప్రతిపక్షాలను, ఉద్యమకారులను, కార్మికులను, రైతులను, విద్యార్థులను, మేధావులను, కళాకారులను అణచివేయడానికై పాశవిక నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నది. ఎన్.ఐ.ఏ చేత దాడులు చేయిస్తూ అర్బన్ నక్సల్స్ (కలాంధారీ మావోయిస్టులు) పేరుతో ఉపా లాంటి తప్పుడు కేసులు పెట్టి జైల్లో బంధిస్తున్నది. ప్రభుత్వాలు ఎన్ని నిర్బంధాలు ప్రయోగించి అడుగడునా ఆంక్షలు విధిస్తున్నప్పటికీ వెనకడుగు వేయకుండా తమ హక్కుల సాధనకై ప్రజలు పోరాడుతూనే వున్నారు. ఫిబ్రవరి 15, 16వ తేదీలలో దేశవ్యాప్తంగా నిర్వహించిన అఖిల భారత సమ్మె, గ్రామీణ భారత్ బంద్ లలో 50-60 కోట్ల మంది ప్రజలు పాల్గొన్నారు.

సకల సంపదలను సృష్టిస్తున్న వివిధ రంగాల సంఘటిత-అసంఘటిత కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, వివిధ రంగాలలో సేవలందించే ఉద్యోగులు తమ డిమాండ్ల సాధనకై ఉద్యమిస్తూ, కేంద్రంలోని ఫాసిస్టు బీజేపీ ప్రభుత్వ ప్రైవేటీకరణ-కార్పొరేటీకరణ-సైనికీకరణ, మతతత్వ విధానాలను వ్యతిరేకిస్తూ దేశ రాజధాని ఢిల్లీలో, పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర, రాజస్థాన్,

కేరళ, పశ్చిమ బెంగాల్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో భారీ ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు, ఆందోళనలు కొనసాగిస్తున్నారు.

## ట్రక్కు డ్రైవర్ల పోరాటం


ట్రక్కు డ్రైవర్ల సమ్మె

ఇండియన్ పీనల్ కోడ్ పేరును మారుస్తూ కొత్తగా తెచ్చిన భారత న్యాయ సంహితలో హిట్-అండ్-రన్ చట్టంలో చేసిన మార్పులు, విధించిన శిక్షలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రోడ్డు రవాణా కార్మికులు నిరవధికంగా సమ్మె చేశారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించి అసాధ్యమైన, అన్యాయమైన మరియు రాజ్యాంగ విరుద్ధమైన నిబంధనలతో, క్రూరమైన పెనాల్టీ మరియు శిక్షార్హమైన చర్యను ఏకపక్షంగా విధించేందుకు సంబంధిత కార్యనిర్వాహక అధికారానికి అధికారాన్ని కల్పిస్తుందని రోడ్డు రవాణా కార్మికులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. రోడ్డు ప్రమాదాల కేసుల్లోనూ పెనాల్టీని పెంచేశారు. హిట్ అండ్ రన్ కేసు నిర్ధారణ అయితే డ్రైవర్ కు పదేళ్ల జైలుశిక్ష పడే అవకాశం వుంది. గతంలో ఐపీసీ సెక్షన్ ప్రకారం ఈ శిక్ష రెండేళ్లుగా ఉండేది. దీంతో పాటు ఏడు లక్షల ఫైన్ విధించనున్నారు. ఈ నిబంధనలను తొలగించాలని కోరుతూ ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్ పోర్ట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా సమ్మెలు, రాస్తారోకో, బైక్ ర్యాలీ, గ్రామీణ బంద్, ధర్నాలు అనేక రూపాలలో పోరాటాలు చేపట్టారు.

చట్టంపై ఎలాంటి అవగాహన కల్పించకుండా కఠినమైన నిబంధనలు ఎలా పెడతారని ప్రశ్నించారు. ఎవరో బడా బాబుల పిల్లలు హిట్ అండ్ రన్ కేసుల్లో లొంగి పోవడం లేదని, అనుకోకుండా జరిగే ప్రమాదాలకు డ్రైవర్లను బాధ్యులను చేయడం సరైంది కాదని వారి ఆవేదనను తెలియజేశారు. ఉత్తరాది రాష్ట్రాలలో ప్రారంభమైన డ్రైవర్ల సమ్మె అనేక ప్రాంతాల్లో ట్యాంకర్, ట్రక్కు డ్రైవర్లతో పాటు ప్రైవేట్ బస్సుల, క్యాబ్ డ్రైవర్లు కూడా ఈ సమ్మెలో పాల్గొన్నారు. మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, ఛత్తీస్ గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో హైవేలను దిగ్బందించారు. అన్ని రాష్ట్రాలలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పెట్రోల్ బంకులు జనంతో నిండిపోయాయి.

డ్రైవర్ల పోరాటానికి ప్రభుత్వం దిగరాక తప్పలేదు. ఆల్ ఇండియా మోటర్ ట్రాన్సపోర్ట్ కాంగ్రెస్ ప్రతినిధులతో సమస్యలను ప్రభుత్వం ముందు పెట్టారు. కొత్త చట్టాన్ని అమలు చేయడానికి ముందు మీ ఆందోళనలను పరిగణనలోకి తీసుకుంటామని, సమీక్షిద్దామంటూ అజయ్ భల్లా మాట్లాడుతూ ఆందోళనలను విరమించండి అని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి స్పష్టమైన ప్రకటనను విడుదల చేయాలని లేకపోతే పోరాటాన్ని మళ్లీ చేపడతామని డ్రైవర్లు వెల్లడించారు.

## హెల్ప్ లైన్ కార్మికుల ఆందోళన


హెల్ప్ లైన్ కార్మికుల ఆందోళన

ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో 112 హెల్ప్ లైన్ లో ఇంటిగ్రేటెడ్ ఎమర్జెన్సీ సర్వీస్ ను ప్రారంభించారు. పలు నంబర్లను గుర్తుంచుకోవాల్సిన అవసరాన్ని తొలగించడానికి ఎమర్జెన్సీ సర్వీస్ ను ప్రారంభించారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ (ఈ.ఆర్.ఎస్.ఎస్) కింద పోలీసు, అగ్నిమాపక దళం, అంబులెన్స్, ఇతర సేవలను పొందటం కోసం అన్నింటినీ కలుపుకొని ఉన్న అత్యవసర హెల్ప్ లైన్ నంబర్. ఈ సంఖ్య భారతదేశం అంతటా పని చేస్తుంది.

హెల్ప్ లైన్ కార్మికులు అవిశ్రాంతంగా పని చేస్తూ డజన్ల కొద్దీ ప్రాణాలను కాపాడుతున్నారు. 365 రోజులు పని చేయవలసి వస్తున్నది. గత ఏడేండ్లుగా హెల్ప్ లైన్ కార్మికుల జీతం పెరగకపోవడంతో అతి తక్కువ జీతాలతో కుటుంబాన్ని

పోషించుకోలేకపోవడమే కాక సొంత ఖర్చులు భరించలేక పోతున్నామంటూ ఆందోళనకు దిగారు. వేతనం నెలకు రూ.11,800 నుంచి రూ.18,000 పెంచాలనీ, వారానికోసారి సెలవు, నెలకు రెండు రోజులు వేతనంతో కూడిన సెలవులు, గ్రాట్యుటీ, ప్రావిడెంట్ ఫండ్ తో కూడిన అన్ని ప్రయోజనాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేపట్టారు.

యూపీలోని యోగి సర్కారు 112 హెల్ప్ లైన్ కార్మికుల హక్కుల, డిమాండ్ల సాధన కోసం నిరసన తెలియజేస్తున్న కార్మికులపై పోలీసులను ఉసిగొలుపుతూ అణచివేస్తున్నది. ప్రభుత్వ అణచివేతను ధిక్కరిస్తూనే తమకు మెరుగైన జీతాలు, సౌకర్యాలు కల్పిస్తే తప్ప పని చేయలేమని కార్మికులు కరాఖండిగా తెలియజేశారు.

# స్కీమ్ వర్కర్స్ పోరాటం

దేశంలోని దాదాపు కోటి మంది స్కీమ్ వర్కర్లు ఆరోగ్యం మరియు విద్యపై కేంద్ర ప్రభుత్వం యొక్క అనేక ముఖ్యమైన ప్రజా పథకాలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచారం కోసం చేసే అన్ని కార్యక్రమాలలో పాల్గొంటూ భారాన్ని మోస్తున్నారు. వారిలో



ఆశావర్కర్లు (జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ కింద పనిచేస్తున్నారు), ఐ.సీ.డీ.ఎస్. కార్యక్రమం కింద అంగన్వాడీ కార్యకర్తలు మరియు పాఠశాల పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం కింద ఎమ్.డీ.ఎమ్. కార్యకర్తలు పని చేస్తున్నారు. దేశంలోని స్కీమ్ వర్కర్లలో దాదాపు 95% మహిళలు ఉన్నారు. దేశంలోని అత్యధిక జనాభాకు ప్రాథమిక ఆరోగ్యం మరియు పోషకాహారాన్ని అందించడంలో ఈ స్కీమ్ వర్కర్లు వెన్నెముకగా పని చేస్తున్నారు. పిల్లల సంస్థాగత డెలివరీ, టీకాలు వేయడం, గ్రామీణ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు, 6 సంవత్సరాలలోపు పిల్లలకు ప్రాథమిక విద్య మరియు ప్రాథమిక-మధ్యస్థ పాఠశాలలకు వెళ్లే పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని పెట్టడంలో స్కీమ్ వర్కర్లు పని చేస్తున్నారు. దేశానికి అవసరమైన ఎన్నో సేవలను అందిస్తూ నిర్దాక్షిణ్యమైన శ్రమ దోపిడీకి గురవుతున్నారు. వారి విధులు, బాధ్యతలు నిర్వచించబడ్డాయి కాని వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా లేదా కార్మికులుగా పరిగణించబడలేదు. కనీసం చట్టబద్ధమైన వేతనాలు చెల్లించడం లేదు.

స్కీమ్ వర్కర్లకు ఈ.పీ.ఎఫ్., ఈ.ఎస్.ఐ. మొదలైన సామాజిక భద్రతా సౌకర్యాలు లేవు. శాశ్వత పదవులు వున్న ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలనే వారి డిమాండ్ ను కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు విస్మరిస్తూనే వున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పథకాలను సాకుగా చూపి రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత నుంచి తప్పుకుంటున్నాయి. స్కీమ్ వర్కర్లను యాజమాన్యం లేని ఉద్యోగులుగా పరిగణిస్తున్నారు. కార్మిక చట్టాల ద్వారా నిషేధించబడి, ''బలవంతపు పని''ని సూచిస్తూ వాలంటీర్లు అంటూ ప్రభుత్వాలు పేరు పెట్టారు. స్కీమ్ వర్కర్లు ''బలవంతపు వాలంటీర్లు'' హోదా నుండి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సంబంధిత హక్కులు, ప్రయోజనాలు, పని పరిస్థితులను డిమాండ్లతో పాటు గౌరవ వేతనాలు చెల్లించాలన్న డిమాండ్ల అమలుకై పోరాడుతున్నారు.

దేశం మరియు ప్రజల సంక్షేమం కోసం తమను తాము అంకితం చేసుకుంటూ పని చేస్తున్న ఫ్రంట్ లైన్ కార్మికుల స్థితి ఇదే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశానికి సేవ చేసేందుకు వారిని నిమగ్నం చేస్తున్నాయి తప్ప చట్టబద్ధంగా రావాల్సిన హక్కులను, వేతనాలను నిరాకరిస్తున్నాయి. కరోనా మహమ్మారి కాలంలో స్కీమ్ వర్కర్లను ఎటువంటి ప్రత్యేక ప్రోత్సాహకాలు లేదా వేతనాలు కూడా ప్రభుత్వాలు చెల్లించలేదు. స్కీమ్ వర్కర్లు తమ ప్రాణాలను పణంగా పెట్టి పని చేస్తూ మరణిస్తే వారికి ఇవ్వాల్సిన 50 లక్షల భీమాను కూడా తిరస్కరించింది వారి ఆవేదనను వ్యక్తం చేశారు.

గ్రాట్యూటీ అనేది కార్మిక చట్టాల్లో ఒకటి. గుజరాత్ లో రిటైరైన అంగన్వాడీలు సుప్రీంకోర్టులో పిటిషన్ వేసి తమకు గ్రాట్యూటీకి అర్హత ఉందని, తమకు ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు అంగన్వాడీలు గ్రాట్యూటీకి అర్హులని, అంగన్వాడీలకు

గ్రాట్యూటీ ఇవ్వాలని తీర్పు ఇచ్చింది. సుప్రీం కోర్టు వ్యాఖ్యానాల ప్రకారం అంగన్వాడీలకు ఇచ్చే గౌరవ వేతనం కాదని, అది వేతనమేనని, గుజరాత్ ప్రభుత్వానికి–అంగన్వాడీలకు మధ్య వున్నది యజమాని–కార్మిక సంబంధమేనని, వారిని నియమించింది, ఉద్యోగ విరమణ వయసు, పని గంటలు, ఇతర విధివిధానాలు రూపొందించింది గుజరాత్ ప్రభుత్వమేనని తీర్పు ఇచ్చింది. ఈ ప్రకారంగా చూసినప్పుడు గుజరాత్ అంగన్వాడీల విషయంలో సుప్రీంకోర్టు చేసిన వాఖ్యానాలు గౌరవ వేతన కార్మికులుగా ఉన్న స్కీమ్ వర్కర్లందరికీ నూటికి నూరుపాళ్లు వర్తిస్తాయి.

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చూసినా 45, 46వ భారత కార్మిక మహాసభల సిఫార్సుల ప్రకారం చూసినా కేంద్ర ప్రభుత్వానికి స్కీముల్లో పనిచేసే వారిని కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు, పీ.ఎఫ్, ఈ.ఎస్.ఐ ఇతర బెనిఫిట్లన్నింటినీ అమలు చేయాల్సిన బాధ్యత ఉంది. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వుంది. వీరు పని చేసే ఐ.జీ.డీ.ఎస్., జాతీయ గ్రామీణ–పట్టణ ఆరోగ్య మిషన్, ప్రధాన మంత్రి పోషణ్, జాతీయ గ్రామీణ–పట్టణ జీవనోపాధుల మిషన్ తదితరాలను ప్రత్యేక శాఖలుగా చేసి వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా తీసుకోవాలి.

వేతనాల పెంపు కోసం స్కీమ్ వర్కర్లు కొన్ని దశాబ్దాల నుండి ఆందోళనలు చేస్తున్నారు. ఫలితంగా కొద్దో గొప్పో వేతనాలు పెరుగుతున్నప్పటికీ ఇప్పటికీ వారి వేతనాలు రూ.11,500, రూ.10 వేలు, రూ.7 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలకు మించి రావడం లేదు. పైగా ఆందోళనలు చేసినప్పుడల్లా ప్రభుత్వాలు స్కీమ్ వర్కర్లపై కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతూ వేధిస్తున్నాయి. అవార్డులిస్తున్న ప్రభుత్వాలు వారిపై ఎఫ్ఐఆర్ లు పెడుతున్నాయి. వీరికి వస్తున్న కొద్దిపాటి వేతనాలే జీవనాధారంగా బ్రతుకునెలదీస్తున్నారు. ఇటువంటి స్థితిలో కూడా ప్రభుత్వాలు వారి పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తున్నాయి. స్కీమ్ వర్కర్ల డిమాండ్లను ఒప్పుకోకపోగా వారి ఉద్యమాలను అణచివేస్తున్నాయి.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇతర చిరు కార్మికుల లాగానే స్కీమ్ వర్కర్ల మీద కూడా కార్మిక వ్యతిరేక వైఖరిని అవలంబిస్తున్నది. సీ.హెచ్.డబ్ల్యూ, వీఓఏ, ఆర్పీలకు వారు చేస్తున్న పథకాలకు వస్తున్న నిధుల నుండే వేతనాలు ఇస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం ఈ పథకాలలో తన వాటాను 90 శాతం నుండి 60 శాతానికి ఏకపక్షంగా తగ్గించుకుంది.



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్లలో పనిచేసే ఉద్యోగులకుగానీ, ప్రభుత్వాల సంబంధిత ఉద్యోగాలు చేస్తున్నటువంటి స్కీమ్ వర్కర్లకు గానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్ల నుండి పథకాల అమలుకు సంబంధించిన నిధులతో పాటు స్కీమ్ కార్మికుల వేతనాలను కూడా సమకూర్చాలి. బడ్జెట్ నుండి అంటే వసూలైన పన్నుల నుండే చెల్లించాలి. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో భవిష్యత్తులో పెట్టుబడిదారీ వర్గాలను బతికించడానికి అవసరమైన పనులు చేయడానికి స్కీమ్ వర్కర్లు ఉపయోగపడతాయనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతున్నది. పెట్టుబడిదారీ అవసరాలను తీర్చే కార్మికులను తయారు చేయడంలో భాగంగా స్కీమ్ వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించడం లేదు.

అత్యధిక ధనికుల వద్ద రాజ్యాంగం ప్రకారం అత్యధికంగా పన్నులు వసూలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై, ప్రత్యేకించి కేంద్ర ప్రభుత్వంపై ఉంటుంది. అలా చేయకుండా కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలపై పన్నులు తగ్గించి సామాన్యులపై భారాలను మోపింది. ఈ విధానం వలన పథకాలకు అవసరమైన నిధులుగానీ, వర్కర్ల వేతనాలుగానీ పెరగడం లేదు. అంతేకాక నిరంతరం పెరుగుతున్న ధరల వల్ల చాలీచాలని జీతాలతో వారి జీవన ప్రమాణాలు పడిపోతున్నాయి. అందుకే ఒక పక్కన వేతనాల పెరుగుదల కోసం పోరాడుతూనే పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఇతర కార్మికవర్గంతో కలిసి స్కీమ్ వర్కర్లు పోరాడకపోతే న్యాయమైన కోర్కెలు సాధించుకోవడం కష్ట సాధ్యమవుతుంది.

దేశవ్యాప్తంగా అంగన్వాడీలు, ఆశావర్కర్లు, పారిశుద్ధ్య కార్మికులు, వాలంటీర్లు, విద్యుత్ ఇంజనీర్లు, ఉపాధ్యాయులు తమ హక్కుల కోసం అందరూ పోరుబాట పట్టారు. వరుసగా నిరసనలు చేస్తున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఈ విధంగా

స్కీమ్ వర్కర్ల సమస్యల పరిష్కారంకై వారి డిమాండ్ల అమలుకై దేశవ్యాప్తంగా అనేక రూపాలలో నిరసన కార్యక్రమాలు, పోరాటాలు చేపడుతున్నారు.

## భవన నిర్మాణ కార్మికులు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం వెంటనే పునరుద్ధరించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం నిర్మాణ యజమానులు చెల్లించే సంక్షేమ నిధిని కార్మికుల సంక్షేమ పథకాల కోసమే ఖర్చు చేయాలని, పెండింగ్ క్లెయిమ్ లు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేశారు.




రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ చట్టం అమలును గత సెప్టెంబర్ 2020లో మెమో 1214 జారీ చేసి వాటిని నిలుపుదల చేసిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా రాష్ట్రంలో వేల కార్మికుల క్లెయిమ్ లు అపరిష్కృతంగా ఉండిపోయాయి. చట్ట విరుద్ధంగా ప్రభుత్వం ఇతర అవసరాలకు సెస్ నిధిని మళ్లించడం ద్వారా దుర్మార్గమైన చర్యలకు పాల్పడుతుండగా, ఇప్పటికే వివిధ కారణాలతో భవన నిర్మాణ కార్మికులకు సరైన వేతనం లేక, రక్షణ లేక, చేతి నిండా పని లేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. పెండింగ్లో ఉన్న క్లెయిమ్ లు వెంటనే చెల్లించాలని, నిర్మాణ యజమాని నుంచి వసూలు చేసిన సెస్ నిధులను ఇతర అవసరాలకు మళ్లించరాదని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేసిన భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని వెంటనే పునరిద్దరించాలని, లేబర్ వెల్ఫేర్ బోర్డు ద్వారా వర్తించే పథకాలను భవన నిర్మాణ కార్మికులకు తప్పక ఇవ్వాలని లేకుంటే పోరాటాలు తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ కార్మికులు దీక్షను చేపట్టారు.

## భారత కార్మికులను ఇజ్రాయిల్ కు పంపటం

నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కౌన్సిల్ (NSDC)ని పర్యవేక్షిస్తున్న స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్షిప్ మంత్రిత్వ శాఖ నవంబర్ 2023లో ఇజ్రాయెల్తో మూడేళ్ల ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీని ప్రకారం నిర్మాణం మరియు సంరక్షణ వంటి నిర్దిష్ట కార్మిక రంగాలలో కార్మికులు తాత్కాలిక ఉపాధి కోసం ఇజ్రాయిల్ కు పంపుతున్నది. పాలస్తీనాపై ఇజ్రాయెల్ లో జరుగుతున్న మారణహోమంలో వేలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఈ యుద్ధం మధ్యనే భారత ప్రభుత్వం ఈ ఒప్పందం కుదిర్చుకుంది. దేశంలోని నిరుద్యోగ యువత జీవితాలను మరణ ఉచ్చులోకి నెట్టివేస్తుంది.

బీజేపీ నేతృత్వంలోని యుపీ మరియు హర్యానా ప్రభుత్వాలు ఇజ్రాయెల్లో ఉద్యోగాల కోసం యువతను పరీక్షించడానికి సన్నాహాలు చేస్తున్నాయని చెబుతున్నప్పటికీ కార్మిక రక్షణతో పాటు కార్మికుల భవిష్యత్తు మరియు వారి సామాజిక భద్రతకు సంబంధించి సెంట్రల్ ఎమ్.ఎస్.డీ.ఈ. మరియు ఎన్.ఎస్.డీ.సీ. ఎటువంటి బాధ్యత వహించవు. ఈ విధమైన ఒప్పందాలతో బీజేపీ ప్రభుత్వం కార్మికుల జీవితాలకు రక్షణ, విలువ లేకుండా చేస్తూ వారి మరణాలకు కారణమవుతుంది. ఇజ్రాయెల్లో ఉద్యోగాలకు అవసరమైన స్కిల్ సెట్స్ను పెంపొందించే పేరుతో ఎన్ఎస్డిసి నిరుద్యోగ యువతను నుండి రూ.10000 వసూలు చేస్తోంది.

ఇజ్రాయెల్ లో పనిచేస్తున్న వేలాది పాలస్తీనా కార్మికులను వెళ్లగొట్టడమే కాకా పాలస్తీనా అస్తిత్వాన్నే తుడిచివేస్తానంటూ అహంభావంతో మారణహోమం సాగిస్తున్న దేశానికి చౌకగా భారతదేశ మానవ శక్తిని అందించడానికి భారత ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య అమానవియం. ఇది అమానవీయ జియోనిస్ట్ మారణహోమ యుద్ధంలో ఇజ్రాయెల్తో నిలబడి భారతీయ కార్మికుల జీవితాలను

పణంగా పెట్టే చర్య. ఈ అమానుష చర్యకు, కేంద్ర ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు, కార్మికులు పోరాడుతున్నారు.

## గ్రామ పంచాయితీ కార్మికులు

తెలంగాణలో వున్న గ్రామ పంచాయతీ సిబ్బంది గత 6, 7 నెలల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని, గ్రామ పంచాయితీ కార్మికులను పర్మినెంట్ చేసి 6, 7 నెలల కారోబార్, బిల్ కలెక్టర్లను, సహాయ కార్యదర్శులుగా నియమించాలి. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద భీమా, ఇన్సూరెన్స్ తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామ పంచాయితీలలో సుమారుగా 60,000 మంది గ్రామ పంచాయితీ ఉద్యోగులు, కార్మికులు పని చేస్తున్నారు. గ్రామాలలో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధి లైట్స్, డంపింగ్ యార్డ్స్, హరితహారం, పల్లె పకృతి వనాలు, వైకుంఠ ధామాలు తదితర పనుల్లో నిత్యం శ్రమిస్తూ గ్రామీణ ప్రాంతాలలో ఎలాంటి అంటువ్యాధులు, అనారోగ్యాలు రాకుండా ప్రజలకు సేవలందిస్తున్నారు. వీరిలో అత్యధికులు దళితులు, బలహీన వర్గాలకు చెందిన పేద కార్మికులు. అటువంటి కార్మికులకు రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాల్లో గత 6 నుండి 7 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికుల నెల భత్యం రూ.8,500 ల వేతనాన్ని చెల్లిస్తున్నది. ఈ వేతనంలో గ్రామ పంచాయతీలలో ప్రజల అవసరాల మేరకు అదనంగా కార్మికులను నియమించి పాత కార్మికుల జీతాలను అదనపు కార్మికులకు కలిపి పంచి ఇవ్వడంతో నెలకు రూ.3,500ల నుండి రూ.4,000 లు మాత్రమే ఒక కార్మికునికి నెల వేతనం వస్తున్నది. చాలిచాలని వేతనాలతో అప్పులు చేసుకుని బతకాల్సిన పరిస్థితి రాష్ట్రంలో గ్రామ పంచాయతీ సిబ్బందికి ఏర్పడింది.

రాష్ట్రంలో 2023 నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా ఎలక్షన్ కోడ్ రావడంతో ఎలక్షన్ కోడ్ రద్దు అయ్యే వరకు పంచాయితీ కార్మికులకు వేతనాలు చెల్లించేది లేదని, కింది స్థాయిలో గ్రామ పంచాయతీలలో అధికారులు చెప్పారు. దీనివల్ల కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎలక్షన్ కోడ్ ముగిసి 3 నెలలు గడుస్తున్నా మా జీతాల కోసం ఇంకా ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది.

కావున తమరు జోక్యం చేసుకొని తక్షణమే 6, 7 నెలలుగా పెండింగ్లో ఉన్న బకాయి వేతనాలను విడుదల చేయాలని, పస్తులతో విధులు నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని, తమ ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించిన హామి ప్రకారం గ్రామ పంచాయతీ సిబ్బందినందరిని పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు లాంటి తదితర సమస్యలను పరిష్కారించాలని వారి న్యాయమైన డిమాండ్ల అమలుకై పోరాటాలు చేస్తున్నారు.

## సింగరేణి కాంట్రాక్ట్ నర్సరీ కార్మికులు

సింగరేణి వ్యాప్తంగా నర్సరీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ నర్సరీ కార్మికులకు అగ్రికల్చర్ జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 2022 సెప్టెంబర్ లో జరిగిన 18 రోజుల సమ్మె సందర్భంగా లేబర్ కమిషన్ ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో భాగంగా చేసిన అగ్రిమెంటు లో నర్సరీ కార్మికులకు అగ్రికల్చర్ జీవో ప్రకారం వేతనాలు, బోనస్ చెల్లిస్తామని సింగరేణి యాజమాన్యం ఒప్పుకున్నది. అగ్రిమెంట్ చేసి సంవత్సరం దాటిన ఇప్పటివరకు నర్సరీ కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు బోనస్ చెల్లించడం లేదు. దీనివల్ల కార్మికులు ఆర్థికంగా చాలా నష్టపోతున్నారు. వెంటనే సింగరేణి యాజమాన్యం స్పందించి నర్సరీ కార్మికులకు అగ్రికల్చర్ జీవో ప్రకారం వేతనాలను, బోనస్ ను అమలు చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. వివిధ కాలనీల్లో పని చేస్తున్న సివిక్ కాంట్రాక్టు కార్మికులకు పని స్థలాల్లో రెస్ట్ రూమ్లను, బాత్రూంలను ఏర్పాటు చేయాలి. లేకపోతే రాబోయే రోజుల్లో కార్మికులంతా ఐక్యమవుతూ పోరాటానికి సైతం సిద్ధమైతామని తెలియజేశారు.

## చేనేత వస్త్ర తయారి కార్మికులు

రాష్ట్రంలోని చేనేత, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సంక్షోభ పరిస్థితులు నెలకొని వున్నాయి. తయారైన బట్టకు సరైన ధర రాక, ప్రభుత్వం నుంచి ఎటువంటి మద్దతు లభించక పరిస్థితులు మరింత దిగజారుతున్నాయి. ప్రభుత్వం నేత కార్మికులకు మార్కెట్లో పోటీ పడేందుకు అవసరమైన నైపుణ్య శిక్షణ, ఇతర సహాయ సహకారాలు అందించడం లేదు. చేనేత కార్మికులకు ప్రభుత్వం బట్ట తయారీ కోసం ఆర్డర్లు ఇవ్వడం లేదు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందని, ప్రభుత్వం ఆదుకోవాలని చేనేత కార్మికులు ఆవేదనను వ్యక్తం చేశారు. 2024 ఫిబ్రవరి నెల నుండి కార్మికులు, ఆసాములు పోరాటాలు చేశారు. బతుకమ్మ చీరలను తయారు చేయించగా వాటికి సంబంధించిన రూ.270 కోట్లు బకాయిలు పెండింగ్లో ఉన్నాయి. నేత కార్మికులకు యారన్ సబ్సిడీ డబ్బులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఉన్న అవకాశాలను కూడా ప్రైవేటు రంగానికి అప్పగించడానికి వ్యతిరేకంగా, చేనేతకు చేయూత పథకానికి నిధులు మంజూరు చేయాలని, త్రిఫ్ట్ పథకానికి ఇవ్వాల్సిన డబ్బులు కార్మికుల ఖాతాల్లో వేయాలనీ డిమాండ్ చేస్తున్నారు.

## మున్సిపల్ కార్మికులు



మున్సిపల్ కార్మికులు సమ్మె సైరన్ మోగించారు. మున్సిపల్ కార్మికుల కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, పారిశుద్ధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలంటూ విజయవాడ ధర్నాచౌక్లో నిరసన తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ వర్తింపజేయాలని, రిస్క్ అలవెన్సు రూ.25 లక్షల భీమా ప్రీమియం స్థానిక సంస్థల ద్వారా చెల్లించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం, క్లాప్ డ్రైవర్లకు రూ.18500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కార్మిక వర్గంలో చీలికలను తీసుకువచ్చి, సమ్మెను దెబ్బ తీసేందుకు ప్రభుత్వం అన్ని రకాల ప్రయోగాలు చేసింది. పోటీ కార్మికులకు రోజుకి రూ.850 నుండి రూ.1000 వరకు, జే.సీ.బీ, ప్రొక్లెయినర్ల కాంట్రాక్టర్లకు రూ.50 నుండి రూ.60 వేలు ఇచ్చి పని చేయించేందుకు ప్రయత్నిస్తే కార్మికులు అడ్డుకున్నారు. నెల్లూరు, విశాఖ, అనంతపురం, తాడిపత్రి, ఒంగోలు, పుట్టపర్తి, ధర్మావరం, నర్సరావుపేట, ఏటూరు తదితర చోట్ల కార్మికులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. మున్సిపల్ అధికారులు బెదిరింపు నోటీసులు ఇచ్చారు. అయినా కార్మికులు అదరక, బెదరక పోరాటాన్ని కొనసాగించారు. ఇంటింటికి తిరిగి లక్షలాది కరపత్రాలు పంచి 'మా పోరాటాన్ని బలపర్చండి' అంటూ రకరకాల వినూత్న కార్యక్రమాలు నిర్వహించారు. కార్మికుల సమ్మెకు దూరంగా ఉన్న కొన్ని సంఘాల క్రమంగా సమ్మెలోకి రావడంతో పోరాటం మరింత ఉధృతంగా సాగింది. అయినప్పటికీ ప్రభుత్వాలు వారి సమస్యల పట్ల సానుకూలమైన స్పదన ఇవ్వటం లేదు.

## ఆశా వర్కర్లు

ఏపీ రాష్ట్రంలో 42వేల మంది ఆశా వర్కర్లు ఉన్నారు. ఆశా వర్కర్లకు ఇచ్చే 10000 జీతాన్ని కూడా నెలకు ఇచ్చేటటువంటి పరిస్థితి లేదు. ప్రతి నెల డెలివరీ కేసులు, పి.హెచ్.సి సబ్ సెంటర్ తిరిగి తమకు వచ్చే జీతంలో నాలుగు వేలు నుండి ఐదు వేలు ఖర్చు అవుతుంది కాబట్టి కనీస వేతనం 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని భారాన్ని తగ్గించాలని కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా వర్కర్లుగా మార్చాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్, మెటర్నిటీ లీవ్ ఇవ్వాలి, ఉద్యోగ భద్రత రిటైర్మెంట్ బెనిఫిట్, కరోనా విపత్కర

పరిస్థితుల్లో ప్రాణాలు కోల్పోయిన ఆశా వర్కర్ కుటుంబాలను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లు సమస్యల సాధనకై ఎప్పుడు గొంతెత్తినా ప్రభుత్వం నొక్కేస్తూనే ఉన్నది. ప్రభుత్వం నుండి ఆశా వర్కర్ల డిమాండ్ల పట్ల ఏ మాత్రం స్పందన లేకపోవడంతో ఆశావర్కర్లు ఆందోళనను ఉధృతం చేస్తున్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలు

అంగన్వాడీ కార్యకర్తలు జీతాలు పెంచాలని ఆంధ్రప్రదేశ్ లో రోజుకో రకంగా నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ఏపీ రాష్ట్రంలో మొత్తం 55,607 అంగన్వాడీ కేంద్రాలున్నాయి. పెరుగుతున్న నిత్యావసర ధరలతో వారి జీవనం గడవటం లేదు, ఆ నిష్పత్తిలో తమకు కూడా జీతాలు పెరగాలని డిమాండ్ చేశారు. కొందరు బంటికాలిపై నిలబడి, ఇంకొందరు రిలే దీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వానికి ఏమీ వినబడడం లేదు, కనబడడం లేదు. అంగన్వాడీలకు, ప్రభుత్వానికి మధ్య దఫాదఫాలుగా చర్చలు జరిగినప్పటికీ అంగన్వాడీల డిమాండ్లలోని వేతనాలు పెంపుదల గురించి మాట్లడకుండా మిగతా అంశాలపై చర్చిస్తూ వర్కర్లను పక్కదారి పట్టిస్తున్నాయి. అంగన్వాడీ కార్యకర్తల డిమాండ్లు పరిష్కరించాలని, వాటికి లిఖితపూర్వకంగా హామీ ఇవ్వాలని, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేస్తూ ఏపీ వ్యాప్తంగా లక్ష మంది వరకు ఈ ఆందోళనల్లో పాల్గొన్నారు.

## విద్యుత్ ఇంజనీర్లు

విద్యుత్ సంస్థల్లో భవిష్యత్తులో జరిగే ఇంజనీర్ల నియామకాలకు కొత్త సర్వీసు నిబంధనలు వర్తింపజేయాలని యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విద్యుత్ ఇంజనీర్లు ఆందోళనబాట పట్టాయి. గత ఏడాది ఫిబ్రవరి లో విద్యుత్ ఉద్యోగుల ఐకాస, ఇంధన శాఖల ప్రతినిధులతో జరిపిన చర్చల్లో పాత నిబంధనల ప్రకారమే నియామకాలు చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోకపోవడంతో విద్యుత్ ఇంజనీర్లు ఆందోళన చేపట్టారు.

## కస్తూర్బా గాంధీ ఉపాధ్యాయుల సమ్మె

కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల ఉపాధ్యాయినులు తమ పోస్టులను క్రమబద్ధీకరిచాలని, మినిమం టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెబాట పట్టారు. సవరించిన పే స్కేల్స్-2022 ప్రకారం కేజీబీవీల్లోని ఒప్పంద ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలంటూ 2022 జనవరి 17న ఆర్థిక శాఖ ఉత్తర్వులు ఇచ్చినా ఇప్పటి వరకు అమలు కాలేదు. ఆ ఉత్తర్వులు ఇచ్చిన తరువాత ఆ పని భారం భరించలేమంటూ సమగ్ర శిశు మందిర్ చేతులెత్తేసింది. కేవలం 23% వేతనం పెంచి తీరిక లేనంత పని భారాన్ని మోపుతున్నారు.

## విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థ అయిన విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం 68 గ్రామాల్లో 16,600 మంది ప్రజానీకం త్యాగాలు చేసి, 22 వేల ఎకరాలు భూమిని స్టీల్ పరిశ్రమ నిర్మాణానికి ఇచ్చారు. ఈ పరిశ్రమ ప్రారంభంలో నిర్వాసిత కుటుంబాలతో పాటు 7 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చింది. ఇప్పుడు 17,576 మంది పర్మినెంట్, మరో 15,600 మంది కాంట్రాక్ట్ సిబ్బందితో 2014 వరకు ప్రతి ఏడాదీ నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తూనే ఉంది. అనుబంధ పరిశ్రమల్లో మరో రెండు లక్షల మందికి ఉద్యోగాలు లభించాయి. ఈ పరిశ్రమను కార్పొరేట్ సంస్థలకు అమ్మేస్తే ప్రస్తుతం ఉన్న ఉద్యోగాలు పోతాయి. కొత్త ఉద్యోగాలు లభించవు.

విశాఖ స్టీల్ ప్లాంట్ దేశానికి, రాష్ట్రానికి ఆదాయం సమకూరుస్తూ, విద్యార్థులకు ఉపాధి కల్పిస్తూ, దళిత, గిరిజనులకు రిజర్వేషన్లు ఇస్తూ, సొంత గనులు లేకపోయినా ఒడిదుడుకులు ఎదుర్కొంటూ లాభాలు గడించి, రూ.మూడు లక్షల కోట్ల ఆదాయం కలిగిన విశాఖ ఉక్కును కేవలం రూ.13 వేల కోట్లకు అమ్మకానికి పెట్టడం దేశ ద్రోహం. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్లకు అమ్మివేస్తూ దళారీ నిరంకుశ, పెట్టుదారీ, సామ్రాజ్యవాద అనుకూలమైన దోపిడీ విధానాలను అమలు చేస్తున్నది. ఈ చర్య వల్ల వేల మంది కార్మికుల జీవితం ప్రశ్నార్థంగా మారింది.

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకోవడానికీ, రేపటి భవిష్యత్తు కోసం, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు కార్మికులు అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. వారి పోరాటం 1000 రోజులకు చేరుకుంటున్నది. ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతంగా చేస్తూ నవంబర్ 8న రాష్ట్ర బంద్ ను చేపట్టి విజయవంతం చేశారు. దేశంలోని కార్మికులంతా విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అంటూ నినదిస్తూ భుజం-భుజం కలిపి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతూ మోడీ మెడలు వంచేలా కార్మికుల పోరాటం సాగుతుంది.



గ్రిడ్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు

## భగీరథ కార్మికుల ఆందోళన

తెలంగాణలో మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికుల వేతనాలు గత మూడు నెలలుగా పెండింగ్ లో వున్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ 2024, మార్చి నెలలో గ్రిడ్ కార్యాలయం ఎదుట ఆందోళనను చేపట్టారు. అర్హులైన కార్మికులకు ప్రమోషన్స్ ఇవ్వాలని, ప్రతి నెలా వేతనాలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాం కల్పించాలి డిమాండ్ చేశారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలను పట్టించుకొని అమలు చేయాలని లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## హమాలీ కార్మికుల సమ్మె

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లోని కార్మికుల వేతన పెంపు ఒప్పదం జరిగి నెలలు గడుస్తున్నప్పటికీ ఒప్పందాన్ని అమలు చేయకపోవడంతో వాళ్లు సమ్మెకు సిద్ధమైయ్యారు. హమాలీ కార్మికుల కూలీ రేట్లు రెండేళ్ళకు ఒకసారి పెంచాలని, ప్రతి 2 సంవత్సరాలకు ఒకసారి రేట్ల సవరణ చేస్తున్న పౌరసరఫరాల శాఖ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో హమాలీ కార్మికుల శ్రమను గుర్తించి హమాలీ రేట్లు పెంచిన జీ.ఓ.ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఒప్పందం ప్రకారం కార్మికులకు యూనిఫాం, కుట్టుకూలీ, మహిళా కార్మికులకు జీ.ఓ. ప్రకారం అన్ని సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలలో అన్ని డిపోల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

## సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమ్మె

ఎన్నో సంవత్సరాలుగా కాంట్రాక్టు కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తూ యజమాన్యం సమాన పనికి సమాన వేతనం చెల్లించకుండ కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయి. ప్రభుత్వాలు కోట్ల రూపాయల లాభాలను పొందుతూ కార్మికులకు తీరని అన్యాయాన్ని తలపెడుతున్నాయి. కార్మికులకు కనీసం బోనస్ కూడా చెల్లిం చకుండా గ్రౌండ్ గనులలో పర్మినెంట్ కార్మికులు చేసే పనిలో కాంట్రాక్టు కార్మికులను వాడుకుంటూ వేతనం మాత్రం 500 రూపాయలు చెల్లించడాన్ని నిరసిస్తూ, కోల్ మైన్స్ యాక్ట్ కు విరుద్ధంగా డ్యూటీలు చేయించడానికీ వ్యతిరేకంగా కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మెకు దిగారు. కాంట్రాక్టు కార్మికులను పర్మనెంట్ కార్మికులు గా చేయాలని, ప్రతి కార్మికుడికి పదివేల దసర అడ్వాన్స్ తో పాటు దీపావళి బోనస్ 20000 ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గని ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని ఓబీ హెల్పర్, వేబ్రిడ్జి లోడింగ్, ఆన్ లోడింగ్ కార్మికులకు కనీస వేతనాలతో పాటు బోనస్, పీఎఫ్ చెల్లించాలనీ, ఈఎస్ఐ హాస్పిటల్ లేదా సింగరేణి వైద్యశాలల్లో కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలకు ఉచిత వైద్యం అందించాలని కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారమయ్యే వరకూ పోరాటాలు చేపడుతామని కార్మికులు తెలియజేస్తున్నారు.



నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

## నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కార్మికుల సమ్మె

తెలంగాణ రాష్ట్రంలో బోధన్ శక్కర్ నగర్లో నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ 2002 వరకు పకడ్బందీగా నడిచింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ ప్రభుత్వం నష్టాల పేరుతో ఫ్యాక్టరీని ప్రైవేటీకరించింది. జాయింట్ వెంచర్గా ఫ్యాక్టరీని నిర్వహించేందుకు డెల్టా పేపర్ మిల్ యాజమాన్యానికి అప్పగించింది.



2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం వంద రోజుల్లో ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకుని పూర్వవైభవం తీసుకువస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. అది పదేండ్ల పాలనలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ముడి సరుకు, నీటి కొరతతో ఫ్యాక్టరీ నడపలేని పరిస్థితి వుందని ఎన్ఎస్ఎఫ్ మేనేజ్ మెంట్ బోర్డు 2015 డిసెంబర్ 23న లే ఆఫ్ ప్రకటించింది. దీంతో ఫ్యాక్టరీ మూతబడింది. ఫ్యాక్టరీ మూతబడి 8 సంవత్సరాలు అవుతున్నది. ఫ్యాక్టరీ మూతబడటంతో ఉద్యోగాలు పోయి ఉపాధి దొరకక ఎంతో కార్మికులు వలస బాట పట్టారు. మరి కొందరు మనోవేదనతో అనారోగ్యంతో బాధపడుతున్నారు. కొంత మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ఫ్యాక్టరీ వినియోగంలో లేకపోవడంతో మిషనరీ పాడైపోయింది. పెద్ద పెద్ద గోదాంలు వృథాగా మారాయి. ఉద్యోగులు, కార్మికులు నివసించేందుకు నిర్మించిన బంగ్లాలు, క్వార్టర్లు, గెస్ట్ హౌస్ లు శిథిలమవుతున్నాయి. ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని 2023, నవంబర్ 11 నాటికి ఫ్యాక్టరీ కార్మికుల రిలే దీక్షలు 100 రోజులకు చేరుకున్నాయి. నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని ప్రభుత్వం పరం చేయాలని, అక్కడి స్థానికి ప్రజలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు, రైతులు నేటికీ రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు.

## వివిధ రంగాలలో కార్మికుల పోరాటం

ఉక్కు, బొగ్గు, చమురు మొదలైన ప్రభుత్వ రంగ పరిశ్రమల కార్మికులు కూడా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మరియు వేతనాల పెంపు కోసం సమ్మెలు చేశారు. చంద్రయాన్ 3ని విజయవంతంగా ప్రయోగించడంలో కీలకపాత్ర పోషించిన రాంచీలోని ఇస్రో కార్మికులకు వేతనాలు పెంచాలని పోరాటం చేస్తున్నారు.

ఓలా-ఉబెర్ డ్రైవర్లు మరియు డెలివరీ వర్కర్లతో సహా గిగ్ మరియు ప్లాట్‌ఫారమ్ కార్మికులు దేశంలోని వివిధ ప్రాంతాలలో మిలిటెంట్ పోరాటాలకు దిగారు. సామాజిక భద్రత అనేది కార్పోరేట్ కంపెనీలను కార్మికుల శ్రామిక శక్తి పట్ల బాధ్యత వహించేలా చేయడానికి బదులుగా కార్మికుల జేబుల నుండి చెల్లించే బీమా పథకాలను మాత్రమే అందిస్తుంది. యాజమాన్యం వర్కర్ల డిమాండ్లను పట్టించుకొని, వారి సామాజిక భద్రత కోసం చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ పోరాటాలు చేస్తున్నారు.

ఫోర్డ్, ఫాక్స్‌కాన్ మొదలైన ప్రైవేట్ బహుళజాతి కార్పొరేట్ కంపెనీల కార్మికులు జరుగుతున్న శ్రమదోపిడీకి వ్యతిరేకంగా ఆగ్రహావేశాలతో రాస్తారోకోలను చేశారు. 12 గంటల పనిదినం ఆర్డర్‌ను ఉపసంహరించుకోవాలని అనేక రాష్ట్రాల కార్మికులు ప్రతిఘటన పోరాటాలకు దిగారు. తమిళనాడులో అత్యంత విజయవంతమైన పోరాటాన్ని చేసింది. దీంతో ప్రభుత్వం ఆర్డర్‌ను వెనక్కి తీసుకోవలసి వచ్చింది. కార్మిక వ్యతిరేక ఆర్డినెన్స్‌లను ప్రవేశపెట్టిన కర్ణాటకలో బిజెపి పాలన కు వ్యతిరేకంగా కార్మికులు కార్మిక సంఘాల నేతృత్వంలో పోరాడుతున్నారు. 2023 సంవత్సరం వివిధ రంగాల కార్మికులు వారి న్యాయమైన డిమాండ్ల అమలుకై ఉవ్వెత్తున పోరాటాలు కొనసాగిస్తూనే వున్నారు.

పరిశ్రమ 4.0, టెక్నాలజీ ఆధారిత వృద్ధి మరియు కార్మిక మార్కెట్, నైపుణ్యం, రీస్కిల్లింగ్ మరియు అప్‌స్కిల్లింగ్ భవిష్యత్తు శ్రామిక శక్తి యొక్క మంత్రాలుగా పరిగణించబడతాయి. జీ-20 శిఖరాగ్ర సమావేశం లేదా భారత ప్రభుత్వం లేబర్ మార్కెట్ నుండి కార్మికుల స్థానభ్రంశం గురించి ప్రస్తావించలేదు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై జీపీఏఐ సమ్మిట్‌లో ప్రసంగిస్తున్నప్పుడు మోడీ కూడా అదే ప్రచారం చేశాడు, అయితే భారీ నిరుద్యోగ సమస్య గురించి మౌనం వహించాడు.

ఇండోర్‌లో జరిగిన జి-20 కార్మిక మరియు ఉపాధి మంత్రుల సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ మరియు డ్రోన్స్ వంటి పరిశ్రమ 4.0 రంగాలపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. మోదీ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను విస్తరించడం మరియు సాంకేతికతతో నడిచే వృద్ధి గురించి మాట్లాడుతున్నాడు, అయితే ఉద్యోగాలు కోల్పోతున్న కార్మికుల గురించి మరియు ఉపాధిని సృష్టించడం గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

ఉపాధిలో తయారీ రంగం వాటా 2022-23లో 16.4 శాతం వద్ద నిలిచిపోయింది. శ్రామికశక్తిలో తయారీ రంగం వాటా 2011-12లో 12.6 శాతం తగ్గి 2021-22లో 11.6 శాతానికి తగ్గింది. సాంప్రదాయకంగా శ్రమతో కూడిన మరియు ఉపాధిని కల్పించే పరిశ్రమలుగా గుర్తించబడిన దుస్తులు మరియు తోలు పరిశ్రమలు వృద్ధి రేటులో క్షీణించాయి (వరుసగా -0.5, 1.2 మరియు -1.8). పారిశ్రామిక ఉత్పత్తి సూచిక 2013-14 నుండి 2022-23 వరకు ప్రతి సంవత్సరం సగటున 2.9 శాతం మాత్రమే పెరిగింది.

యువ గ్రాడ్యుయేట్లలో నిరుద్యోగం రేటు 42.5 శాతం. యూపీఏ హయాంలో కర్మాగారాల్లో ఉద్యోగుల సంఖ్య ఏటా 6.2% పెరిగింది. మోదీ ప్రభుత్వ హయాంలో ఈ వృద్ధి 2.8 శాతానికి పడిపోయింది. అదేవిధంగా, యూపిఎ హయాంలో కార్మికులకు వేతనాలు ఏటా 17.1% పెరిగాయి, 2014 నుండి 8.4%కి పడిపోయాయి.

ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారతదేశం ఒకటి అయినప్పటికీ, ప్రతికూలత ఏమిటంటే, వేగంగా పెరుగుతున్న అసమానతలు కలిగిన దేశాల్లో భారతదేశం ఒకటి అని ఆక్స్ ఫామ్ నివేదిక పేర్కొంది. బీజేపీ పాలనలో గత దశాబ్దంలో అసమానతలు బాగా పెరిగాయి. ప్రపంచంలోని అత్యంత సంపన్నులతో పోటీపడే స్థాయికి సంపన్నులు భారీ సంపదను మూలన పడేసారు, అయితే దేశంలో పేదల సంఖ్య మరియు అసమానతలు పెరుగుతూనే ఉన్నాయి. పేదలు కనీస వేతనాలు, నాణ్యమైన విద్య మరియు అందుబాటు ధరలో వైద్యం కూడా పొందలేకపోతున్నారు. వారికి కనీస సామాజిక భద్రత, ఉద్యోగాల క్రమబద్ధీకరణ కూడా నిరాకరించబడింది.

ఉపాధి నష్టం, వేతన నష్టం మరియు నిరుద్యోగం ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి, అయితే మోడీ మాత్రం సాంకేతికతతో నడిచే వృద్ధి గురించి మాట్లాడుతున్నాడు. ఇది ప్రాథమికంగా నిరుద్యోగ వృద్ధి. మరిన్ని ఉద్యోగాలను సృష్టించడం ఈ కాలపు అవసరం, కానీ కేంద్ర ప్రభుత్వం ఉన్న ఉద్యోగాలను కూడా చంపే విధానాలను అనుసరిస్తోంది. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మోదీ ప్రభుత్వం వాగ్దానం చేసినా అసలు ఎలాంటి అవకాశాలు, ఉద్యోగాలు పెంచలేదు.

చట్టం ప్రకారం ఎలాంటి క్రమబద్ధీకరణ, వేతన భద్రత మరియు సామాజిక భద్రత కోసం దావా వేయలేని కార్మిక సైన్యాన్ని సృష్టించడం మోడీ విజన్ 2047. యజమాని-ఉద్యోగి సంబంధాలు అస్పష్టంగా ఉన్న చోట గిగ్ మరియు ప్లాట్‌ఫారమ్ వర్కర్ల మాదిరిగా శ్రామిక శక్తిని సృష్టించడం మోడీ దృష్టి. గిగ్ మరియు ప్లాట్‌ఫారమ్ వర్కర్ల నమూనాలో అనువైన పని ఏర్పాట్లు మరియు అనువైన ఆదాయ వనరుల వ్యవస్థ, కార్మికుల హక్కులు మరియు జీవనోపాధిని విచ్ఛిన్నం చేయడానికి కుయుక్తి తప్ప మరొకటి కాదు. పారిశ్రామికవేత్తలు తమ సొంత కార్మికుల అవసరాలను చూసుకునే భారం నుండి ఉపశమనం పొందుతున్నారు, అయితే కార్మికులు తమను తాము పోషించుకోవడం భారంగా ఉంది. ప్రస్తుత చట్టాల ప్రకారం తప్పనిసరి అయిన ఈ.ఎస్.ఐ. మరియు పీఎఫ్ కూడా లేబర్ కోడ్‌ల ద్వారా ఐచ్ఛికం చేయబడుతున్నాయి.

ఫాసిస్టు మోడీ ప్రభుత్వం అభివృద్ధి మరియు నైపుణ్యాల భాగస్వామ్యం గురించి ప్రపంచీకరణ గురించి మాట్లాడుతున్నాడు కానీ భారతదేశంలోని కార్మికులకు ప్రపంచ వేతనాలు చెల్లించడం లేదా కార్మికులతో లాభాలను పంచుకోవడం గురించి మాట్లాడలేదు. అతను ప్రపంచవ్యాప్తంగా మొబైల్ వర్క్‌ఫోర్స్, మైగ్రేషన్ మరియు మొబిలిటీ పార్టనర్‌షిప్ మొదలైనవాటి గురించి మాట్లాడుతున్నాడు తప్ప కార్మికుల హక్కుల గురించి, వారి న్యాయమైన డిమాండ్ల గురించి మాట్లాడపోగ వారి శ్రమ శక్తిని మరింత దోపిడీ చేయపూనుకుంటుంది. ✪

# బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిస్టు బీజేపీని ఎండగడుతూ

# మతతత్వాన్ని, మతోన్మాదాన్ని తుదముట్టిద్దాం.

ప్రస్తుతం దేశంలో ఎన్నికల కాలం నడుస్తున్నది. గత కొంత కాలంగా సాగుతున్న ఓట్ల యుద్ధం ముగింపు దశకు చేరుకుంటుంది. మళ్లీ అధికారంలోకి రావాలని బీజేపీ ప్రయత్నిస్తోంటే, మరోసారి ఆ పార్టీ అధికారంలోకి వస్తే దేశం ఏమైపోతుందని ఆందోళనపడేవాళ్లు ఎక్కువ అవుతున్నారు. మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం అంటే 'హిందూ రాష్ట్ర' స్థాపన అధికారికంగా ప్రారంభం కావడమే. ఇప్పటికే దానికి అవసరమైన సన్నాహాలను బీజేపీ పూర్తి చేసుకున్నది. సకల సాధనాలను ఉపయోగిస్తున్నది. మరో వైపు కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీల ఉనికిని నిర్ణయించే ఎన్నికలు కూడా. బీజేపీ మత రాజకీయాల మీద వ్యతిరేక వాతావరణంలో అయినా అధికారంలోకి రాకపోతే ఇక ఆ తర్వాత అవకాశమే ఉండదని ఆ పార్టీ ఎన్నికలకు సిద్ధమవుతున్నది. 2024 ఎన్నికలు ఈ దేశ గమనాన్ని ఎటువైపు తీసుకెళ్తాయోననే అభిప్రాయం చాలా మందిలో వుంది. దేశ రాజకీయ యంత్రాంగంలో మతతత్వ సిద్ధాంతం చొచ్చుకుపోతున్నది.




బీజేపీ తన గెలుపు అవకాశాలను గరిష్టంగా ప్రచారం చేసుకుంటున్నది. ఎన్నికల రాజకీయాల్లో ఈ ఎత్తుగడను అందరూ అనుసరిస్తారు. అయోధ్య రామమందిరాన్ని ప్రారంభించాక బీజేపీ పార్టీ నాయకులు టార్గెట్ 400 స్థానాల్లో విజయం సాధిస్తే తమకు తగ్గట్టుగా రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రచారాన్ని బహిరంగంగానే ప్రకటించారు. రాజ్యాంగంలోని లౌకికవాదం అనే మాటను తీసేస్తామని అంటున్నారు. వాళ్లకు సెక్యులరిజం అంటే కుహనా సెక్యులరిజం. హిందుత్వ మాత్రమే నిజం. కాబట్టి హిందూ దేశంగా మార్చడానికి రాజ్యాంగంలోనే మార్పులు తెస్తామని స్పష్టం చేస్తున్నారు. ఆ దిశగా ఈ ఎన్నికలలో గెలుపు కోసం పని చేయాలని హిందుత్వ శక్తులకు బీజేపీ నాయకులు దిశానిర్దేశం చేశారు. దీనికి అవసరమైన పునాదిని పదేళ్లుగా అన్ని వైపులా నుండి ఏర్పరుచుకున్నారు. ఇప్పుడు దాన్ని మరింత వేగవంతం చేస్తున్నారు.

పార్లమెంట్ అధికారంలోకి రావడానికి అన్ని ఓట్ల పార్టీలు ఎన్నికల్లో అనేక ఎత్తుగడలు అనుసరిస్తాయి. గెలుపే లక్ష్యంగా అవి ఉంటున్నాయి. కానీ బీజేపీ మూడోసారి అధికారంలోకి రావడానికి చేస్తున్న ప్రయత్నాలు అంత వరకే పరిమితమయ్యేవి కావు. దీర్ఘకాలికంగా మన సమాజాన్ని, రాజకీయాలను, ప్రజల మనసులను, విలువలను ప్రభావితం చేయగల స్థాయిలో ఎన్నికల ఎత్తుగడలు అనుసరించడం బీజేపీకి మాత్రమే చెల్లు. ఫాసిజం ప్రమాదం అంత తీవ్రమైనది.




ఉదాహరణకు ఫిబ్రవరి 13, 2024న కర్నూలుకు వచ్చిన మోహన్ భాగవత్ సంఘ్ కార్యకర్తలను ఉద్దేశిస్తూ "సంఘ్ ఇప్పుడు అనేక రంగాలలోకి విస్తరించింది. రాజకీయ క్షేత్రంలోకి ప్రవేశించి ప్రభుత్వాన్ని కూడా ఏర్పాటు చేసింది. రామజన్మ భూమి ఉద్యమాన్ని నడిపి విజయం సాధించడం జనవరి 22, 2024 న అందరం చూశాం'' అని మాట్లాడాడు. ఇందులో సాంస్కృతిక, భావజాల వ్యూహం ఉన్నప్పటికీ వాళ్ల రాజకీయ వ్యూహం ప్రధానం. గతంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఏమేం చేసిందో చెప్పాడు. రాబోయే ఎన్నికల్లో కూడా

అలాంటిది చేయడానికి వాళ్లు సిద్ధం. 2019లో పక్కన పడిన సీఏఏను ఇప్పుడు తీసుకరావడం అట్లాంటిదే. ఈ ఎన్నికల్లో విజయం తర్వాత రామమందిరంలాగే సీఏఏను, ఉమ్మడి పౌరస్మృతిని కలిపి గొప్ప విజయంగా వాళ్లు చెప్పుకుంటారు.

ఈ రాజకీయ అధికారం దేనికోసమో సంఘ్ పరివార్ కు బాగా తెలుసు. వచ్చే ఏడాదికి సంఘ్ ఏర్పడి వందేళ్లు కాబోతుంది. గతంలో అధికారంలోకి వచ్చినప్పటి కంటే ఇప్పటి పరిస్థితులు వేరుగా ఉన్నాయి. అది ఏర్పడ్డ వందేళ్ళకు దేశంలో ఒక బలమైన రాజకీయ శక్తిగా అది మారింది. అది సారంలో ఫాసిస్టుగా మారింది. అందుకు భావజాల రంగంతో పాటు రాజకీయ రంగంలో స్థిరపడటానికి కార్పొరేట్ శక్తులు దానికి ఉపయోగపడ్డాయి, పడుతున్నాయి కూడా. గత కొన్నేళ్లుగా సంఘ్ నాయకులు తమ కార్యకర్తలకు హిందూ రాష్ట్ర సాధన దిశగా పని చేయాలని చెబుతున్నారు. అది నెరవేర్చడానికి వాళ్ళు రాజకీయ క్షేత్రంలో అధికారంలో కొనసాగడానికి ఈ ఎన్నికల్లో తీవ్రస్థాయిలో ప్రయత్నిస్తున్నారు. ఈ పదేళ్లలో అది రాజకీయాధికారం వల్ల అన్ని వ్యవస్థలను, అన్ని ప్రజాస్వామిక ప్రగతిశీల భావనలను ధ్వంసం చేసే దశకు చేరింది. దేశాన్ని మత ప్రతిపాదికన పోలరైజ్ చేయగల శక్తిని కూడగట్టుకుంది.

వీటన్నిటి ద్వారా మళ్లీ అధికారంలోకి వచ్చి 2025తో మొదలు పెట్టి 2047 నాటికి దేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చడం ఆర్.ఎస్.ఎస్. ప్రణాళిక. దానిని అది బహిరంగంగానే ప్రకటించింది. ప్రభుత్వమే వాళ్ల చేతులలో ఉన్నది కాబట్టి అందుకు అవసరమైన అన్ని పనులు అది చేసుకుంటూ పోతున్నది. ఆర్టికల్ 370 రద్దు, రామమందిరం, సీఏఏ, నూతన వ్యవసాయ చట్టాలు, 4 లేబర్ కోడ్లు వంటి చట్టాల మార్పు దాకా అన్నీ వీటిలో భాగమే.

దేశంలోని కార్మికులు తక్కువ వేతనాలు, ఆకాశాన్నంటుతున్న ధరల పెరుగుదల మరియు నిరుద్యోగం, సామాజిక భద్రత లేమితో జీవనోపాధి లేక తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. కార్మికుల హక్కులు మరియు జీవనోపాధి వ్యవస్థను నాశనం చేయడానికి నాలుగు లేబర్ కోడ్‌లు రెక్కలపై వేచి ఉన్నాయి. ఉభయ సభల్లోనూ లేబర్ కోడ్‌లను ఆమోదించినప్పటికీ, దేశంలోని కార్మిక సంఘాల నుంచి తీవ్ర ప్రతిఘటనతో పాటు 2024లో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతామన్న మోదీ భయం కారణంగా వాటిని అధికారికంగా అమలులోకి తీసుకురాలేదు. ప్రస్తుతానికి దానిని హోల్డ్‌లో వుంచారు.

అయోధ్యలో రామమందిరం నిర్మించి ఆ పేరుతో దేశంలో మత విద్వేషాలు పెంచి, ప్రజల వాస్తవ సమస్యలను మభ్యపెట్టి ఎన్నికల్లో గెలవాలని బీజేపీ కలలు కంటోంది. కార్మికవర్గ హక్కులకు మరియు ప్రజల శ్రేయస్సుకు వ్యతిరేకంగా అదానీలు, అంబానీలు మరియు సంఘ్ బ్రిగేడ్‌ల "కార్పొరేట్, మతతత్వ దేశం" గా మార్చివేయ పన్నాగాలు పన్నుతుంది. భారతదేశం యొక్క ''సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య'' రాజ్యాంగాన్ని తొలగించి మధ్యయుగాల నాటి మను స్మృతిని ఆధునిక భారతదేశంలో భర్తీ చేయడానికి బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీజేపీ మోడీ ప్రభుత్వం ప్రజలకు నరకం చూపుతున్నది.




హిందుత్వ రాష్ట్ర సాధన కోసమే కాక కార్పొరేటీకరణను వేగవంతం చేయడానికి తగిన విధంగా ఈ మార్పులన్నీ చేసుకుంటూ పోతున్నారు. బీజేపీ, కార్పొరేట్ వర్గాలు జమిలిగా ఈ దేశ ప్రజల స్వేచ్ఛ మీద, హక్కుల మీద, సంపద మీద దాడి చేస్తున్నాయి. సంపద మీద కార్పొరేట్ శక్తుల గుత్తపెత్తనం, సంస్కృతి మీద హిందుత్వ గుత్తపెత్తనం సాధించడం కోసం ఈ రెండు శక్తులు ఒక్కటిగా పని చేస్తున్నాయి.

మొదటి నుండి ఈ దేశం హిందువులదీ మాత్రమే అన్నది సంఘ్ అభిప్రాయం. ఇక్కడ ఉండే ఎవరైనా హిందూ సంస్కృతికి, ధర్మానికి లోబడి, దానికి అనుగుణంగానే వుండాలన్నది సంఘ్ పరివార్ సిద్ధాంతం. దీన్ని సాధించడానికి హిందూయేతర ప్రజల మీద విద్వేషాన్ని సమాజంలో నింపుతూ వచ్చింది. ఇప్పుడు అధికారంలో వున్నారు కాబట్టి చట్టప్రకారంగానే మనుషులను వేరు చేసే పని పెట్టుకున్నారు. ఎన్నో నిరసనల మధ్య గతంలో ఆగిన సిటిజన్ షిప్ అమెండ్మెంట్ ఆక్ట్ (సిఎఎ) 2019ను మార్చి 11, 2024 నుండి




అమలులోకి తీసుకువచ్చారు. గతంలో దీని మీద జరిగిన చర్చలు, వచ్చిన భిన్నాభిప్రాయాలను అన్నిటినీ పక్కన పట్టి అమలులోకి వస్తుందని హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. దీని ఉద్దేశం ముస్లింలను, అసమ్మతి తెలిపే వారిని ఈ దేశ పౌరులు కాదని చెప్పడమే. దీని మీద అనేక విశ్లేషణలు గతంలోనే వచ్చాయి. ఇది ఎన్నికల ముందు తీసుకురావడం ఓట్ల వేట కోసం మాత్రమే కాదు హిందూరాష్ట్ర సాధన అనే లక్ష్యం కూడా వుంది. దీని వల్ల హిందూ ఓటర్లు ప్రభావితం అవుతారనే బీజేపీ వ్యూహం.

ఇవి హిందూ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన విషయాలుగా కన్పిస్తున్నప్పటికీ వీటి వెనుక కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలు కూడా ముడిపడి వున్నాయి. 370 రద్దు తరువాత కాశ్మీర్లో పెద్ద ఎత్తున పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతున్నది. ఇది అక్కడి ప్రకృతిని, ప్రజల జీవనాన్ని కార్పొరేట్లు ధ్వంసం చేస్తున్నాయి. దీనికి వ్యతిరేకంగా అక్కడి ప్రజలు ఆందోళన చేస్తున్నారు. ఆర్టికల్ 370 రద్దు అఖండ హిందూదేశ స్థాపన కోసమే కాదు, కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కూడా.

ఒకవైపు హిందూ రాష్ట్ర స్థాపన హిందువుల కోసం అని ప్రచారం చేస్తూ దేశమంతటా కార్పొరేటీకరణను వేగవంతం చేయడం హిందుత్వ ఫాసిస్టుల వ్యూహం. అందుకే దేశంలోని సమస్త ప్రజల సంపద కార్పొరేట్ల పరం అవుతున్నది. గతంలో ఎన్నడూ లేనంతగా పబ్లిక్ ఆస్తులన్నీ ప్రైవేటీకరణ పేరుతో అమ్మి వేస్తున్నారు. పేరుకే హిందూ దేశం కానీ హిందూ ప్రజలకు కూడా ఈ దేశ ప్రాకృతిక వనరుల మీద ఎటువంటి అధికారం ఉండదు. ఇవన్నీ పెట్టుబడిదారీ కార్పొరేట్ శక్తుల సంపదను పెంచడానికే తప్ప పేద ప్రజల కోసం కాదు. ఈ పదేళ్ళలో బహిరంగ భయానక నియంతృత్వాన్ని నెలకొల్పిన హిందుత్వ ఫాసిజం పరిపాలన దేశ ప్రజల అనుభవంలోకి వచ్చింది. దీని వల్ల నష్టపోతున్న వారిలో అనేక మతాలతో పాటు మెజార్టీ హిందువులు కూడా ఉన్నారు. బీజేపీ చెబుతున్న హిందూ రాష్ట్రం హిందువుల సంక్షేమం కోసం కాదు అన్నది తేటతెల్లం.

ముస్లింలను విదేశీ దురాక్రమణదారుగా, పరాయివారుగానే ప్రచారం చేసి, వాళ్ల పౌరసత్వాన్ని సందేహంలో పడేసి, హిందుత్వ నిరంకుశ ఆధిపత్య శక్తిగా రాజ్యంలో, సమాజంలో అధికారంలోకి రావడమే ఆర్.ఎస్.ఎస్. వ్యూహం. హిందుత్వ, కార్పొరేటీకరణ తమకు ప్రమాదమని మెజారిటీ హిందువులకు తెలియకుండా చేసి, వాళ్లు నిరంతరం ముస్లింలను ద్వేషించేలా చేయడానికి ఈ ఎన్నికల ప్రచారాన్ని వాడుకుంటున్నారు.

ఆర్ఎస్ఎస్-బీజేపీ తన లక్ష్యాన్ని సాధించడం కోసం అన్ని వర్గాల ప్రజలను అణచివేస్తుంది. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా కార్మికవర్గ పార్టీ నాయకత్వంలో అశేష పీడిత వర్గాలు, సముదాయాలూ ఐక్యంగా పోరాడవలసిన అత్యంత ఆవశ్యకత ఏర్పడింది. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజాన్ని ప్రజలలో బహిర్గతం చేస్తూ ఒంటరి చేసి ఓడిస్తేనే మన దేశ ప్రజలను, సంపదను కాపాడుకోగలం. దేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నాయకత్వంలో దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని అంచెలంచెలుగా ముందుకు తీసుకుపోతూ అర్ధవలస-అర్ధ భూస్వామ్య రాజ్యాంగ యంత్రాన్ని కూల్చి నూతన ప్రజాస్వామిక విప్లవం దిశగా దేశాన్ని పురోగమింపచేద్దాం. మతతత్వాన్ని, మతోన్మాదాన్ని, దోపిడీ దళారీ బూర్జువా-భూస్వామ్య పాలక వర్గాలను తుదముట్టిద్దాం.




ఆదిలాబాద్ జిల్లాలో కలెక్టర్ కార్యాలయం అంగన్వాడి హెల్పర్ల ధర్నా.









మాట్లాడుతున్న ఆర్టీసీ ఉద్యోగ నేత





**UP IN ARMS:** Members of Odisha State Fishermen Federation stage a protest at Lower PMG in Bhubaneswar, Tuesday, seeking fulfilment of their 6-point charter of demands



బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని మీర్‌పూర్‌లో తమ వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ.. మంగళవారం ట్రాఫిక్‌ను అడ్డుకుని నిరసన వ్యక్తం చేస్తున్న గార్మెంట్ కార్మికులు





నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్–గుండంపల్లి శివారులో ఇథనాల్ పరిశ్రమను వ్యతిరేకిస్తూ రోడ్డుపై బైఠాయించిన రైతులు

ప్రపంచ కార్మికులారా ఏకం కండోయో...
పోరాడితే పోయేదేమి లేదు బానిస సంకెళ్లు తప్ప
హక్కుల సాధనకై ఐక్యంగా పోరాడుదాం
దళారీ నిరంకుశ బడా బూర్జువా,
సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థల
కార్పొరేట్ శక్తుల మెడలు వొంచుదాం
సాధించుకున్న హక్కులను కాపాడుకోవడానికి
మరింత సమరశీలంగా పోరాడుదాం
కార్మికుల జీవితాలకు భద్రత లేకుండా చేస్తూ
కార్మికవర్గ హక్కులను కాలరాసి
ఫాసియిజాన్ని అమలు చేస్తున్న
దోపిడీ పాలక వర్గాలను పాతిపెట్టడానికి
కదనరంగంలో కలిసి రండి.......

